సెప్టెంబర్-2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,



**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లోపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్తునేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| మీరేమాలోచిస్తున్నారు? | కె.ఇ. రాజేంద్ర | 08 |
| నిన్ను నీవు హెచ్చించుకోవద్దు | | 09 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 10 |
| హృదయమును..... | సాక్ష్యము | 11 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 14 |
| క్రొత్తకోణాలు | అద్దంకి జాన్‌వెస్లీ | 15 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| ఎస్తేరు | స్త్రీల కొరకు | 20 |
| విశ్వసించుట | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్-09 | | 24 |





సీరియల్ నంబరు

సంపాదకీయం....

# దేవుడు నిత్యము నడిపిస్తాడు

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

ఈ భూమ్మీద ప్రతి మనిషినీ పుట్టించేది దేవుడే. పుట్టించిన దేవుడే ప్రతి మనిషి బాధ్యత తీసుకుంటాడు. తన ప్రేమకు ప్రతిరూపంగానే దేవుడు తన స్వరూపమందు తన పోలికెగా మనిషిని చేశాడు. దేవుడు మనిషిని తనకోసం, తన సొత్తుగా, ప్రేమగా సృజించుకున్నాడు. 'మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను' (ఎఫెసీ. 1:4-6). దేవుడు మనిషిని ప్రేమిస్తున్నాడు అనడానికి నిదర్శనంగా మనిషికి పూర్తి స్వేచ్ఛని ఇచ్చాడు. మనిషిని సృష్టించింది నేనే కదా, ఆ మనిషి నాకు లోబడి, నా మాట జవదాటకుండా ఉండాలి, తనకంటూ ఎలాంటి ఇష్టాయిష్టాలు ఉండ కూడదు అనుకుంటే అది ప్రేమ కాదు. అయితే దేవుడు తనకిచ్చిన స్వేచ్ఛని మనిషి దుర్వినియోగం చేస్తున్నాడు. దేవుని మాటకు లోబడకుండా తన ఇష్టప్రకారం చేసి దేవుని ప్రేమని తృణీకరించి దేవున్ని ఎదిరించాడు. ఈ లోకానుసారమైన జీవింతం జీవించే మనుష్యులు ఎవరికిష్టమైన మార్గం వారు ఎంచుకొని అదే సరైన మార్గమనుకొని నాశన మార్గమువైపు వెళ్తున్నారు. ఆ మార్గం యొక్క అంతము మరణమన్న విషయం వారికి తెలియదు. 'ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు అయితే తుదకు అది మరణమునకు త్రోవ తీయును' (సామెతలు 14:12). చాలామంది తమ స్వంత ఆలోచనతో వారు ఎంచుకున్న మార్గములో సగం దూరం ప్రయాణం చేశాక ఎటు వెళ్ళాలో తెలియని అయోమయ పరిస్థితులు ఎదురై దారి తప్పిపోతారు. అందుకే అనేకమంది తప్పుడు మార్గములో వెళ్ళి ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తూ అనేక వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటుంటారు. ఈ లోకభోగాలు అనే ఊబిలో కూరుకుపోయి ఎలా బయటకు రావాలో తెలీక వారి జీవితాలు అగమ్యగోచరంగా తయారవుతాయి. నీకు ఉపదేశము చేసెదను నీవు నడవవలసిన మార్గమును నీకు బోధించెదను నీ మీద దృష్టియుంచి నీకు ఆలోచన చెప్పెదను' (కీర్తనలు 32:8) అని దేవుడు భరోసా ఇస్తున్నాడు. ఎవరైతే తమను దేవుడు నడిపించాలని కోరుకుంటారో వారిని దేవుడు సరైన మార్గంలో నడిపించే బాధ్యత దేవుడు తీసుకుంటాడు. వారు నడవాల్సిన మార్గాన్ని దేవుడికి అప్పగించినవారు నిశ్చింతగా ఉంటారు. వారి జీవితం నల్లేరు మీద నడకలా ఉంటుంది. వారు ఎంతో ధైర్యంగా ఉంటారు. వారిని దేవుడు జీవిత అంతము వరకు నడిపిస్తాడు. 'యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు. పచ్చికగలచోట్ల ఆయన నన్ను పరుండజేయును. శాంతికరమైన జలముల యొద్ద నన్ను నడిపించుచున్నాడు' (కీర్తన 23:1,2). దేవుడిని నీ జీవితంలోకి ఆహ్వానిస్తే ఆయన నిన్ను తృప్తిపరచి, నీ యెముకలను బలపరుస్తాడు. శాంతికరమైన జలముల యొద్ద నిన్ను నివసింపజేసి, సమృద్ధియైన జీవితంతో నిన్ను నిత్యము నడిపించడానికి ఎల్లప్పుడూ సిద్ధముగా ఉంటాడు. దేవుడు నిన్ను నిత్యము నడిపించాలని నీవు కోరుకుంటే ఆయనను నీ జీవితంలోకి నేడే ఆహ్వానించు. ఇదే అనుకూల సమయం, నేడే రక్షణ దినము.

-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434O**

# జఫ్నత్పనేహు

**(యోసేపు జీవిత చరిత్ర)**

**– కొడవటికంటి**

ఎప్పుడైనా మళ్ళీ యజమానురాలు కనబడితే, నా హృదయంలో ఎవరు ఉన్నారో చూపిస్తే? నవ్వు వచ్చింది. సన్నగా నవ్వుకున్నాడు. ఆ రోజు మొట్టమొదటిసారి తన యజమానురాలితో కలసి ఆసెనా ఇంటికి వెళ్ళినప్పుడు తన యజమానురాలు ఆసెనతుని హత్తుకొని ఆసెనత్ తల తన భుజం మీద ఒత్తుకొనినపుడు ఈ ఆలోచన రాలేదు. కానీ ఈనాటి ఈ ఏకాంతం వలననో, లేక పెరిగిన వయసు వలనో రుచి చూచిన చేదు అనుభవాల వలనో కాని ఆసెనత్‌ని తన యజమానురాలు హత్తుకొనినట్లు తను హత్తుకుంటే ఇప్పటి నుండి నేను ప్రతి నిమిషం ఆసెనత్‌ని నా హృదయంలో ఉంచుకొంటే... ఇంతకాలం ఈ ఆలోచన ఎందుకు రాలేదు? అని బాధపడ్డాడు. చెరసాలలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా ఆసెనాని నిన్న చూసినట్లుగానే ఉంది. ఒక నిమిషం క్రితం ఆమె స్వరం విన్నట్లుగా ఉంది... ఇది తన బలహీనత కాదా? కాదు, ఇది ఆమెలో ఉన్న ప్రభావం. ఆసెనతుతో గడిపిన కొన్ని క్షణాలే తనని ఇలా వెంటాడుతుంటే నిత్యము ఆమెను చూస్తూ ఉండే ఆ ఇంటి బానిసలు, ఎంత అదృష్టవంతులు. తన వయస్సున్న మగ బానిసలు కూడా ఉండి ఉంటారు. వారు ఎప్పుడూ ఆసెనతుని చూస్తూ ఉంటారు. ఆమె ఏదైనా పని చెబితే బాగుండును అనుకుంటుంటారు. ఇట్లాంటి ఆలోచన రాగానే ఆసెనా ఇంట్లో ఉండే వాళ్ళందరి మీద యోసేపుకు కోపం వచ్చింది. విసుగ్గా ఉంది. ఏమి చెయ్యాలో పాలు పోవట్లేదు. కోపంగా వెనక్కి తిరిగాడు. ఎదురుగా థేమాను నిలుచుని నవ్వుతున్నాడు.

యోసేపు భుజంమీద చెయ్యి వేయగానే యోసేపుకి సిగ్గు వేసింది. “పూజారులను గురించి మాట్లాడితే ఎందుకని మీరు అంత లోతులోకి వెళ్ళిపోయారు? అంత త్వరగా వేరే లోకంలోకి ఎలా వెళ్ళగలిగారు? మీ ముఖం చూస్తూనే ఉన్నాను. ముందు మధురంగా సాగిన మీ ఆలోచన గబుక్కున ఎందుకు కోపంగా మారింది? చెప్పండి” అన్నాడు బ్రతిమాలినట్లుగా.

యోసేపు అటువైపు చూసి ఏదో పని ఉన్నవానిలా నడిచి వెళ్ళిపోతుంటే థేమాను కళ్ళు యోసేపు వైపు ప్రేమగా చూశాయి. తను అతి తెలివి వలన చెరసాల పాలైతే, యోసేపు అతి మంచితనం వలన చెరసాల పాలయ్యాడు. రెండింటికి ఒకే గమ్యమా? యోసేపు ఎప్పుడూ మాట్లాడే అతని దేవుడు అతనిని కాపాడతాడా? ఈ చెరసాలలో ఎందరు అభాగ్యులు బ్రతికి వుండీ కూడా బయటి ప్రపంచానికి మరువబడ్డారో. ఇంతటి మెత్తని హృదయం ఉన్న యోసేపు ఈ సంగతి తెలుసుకొని భరించగలడా? ఇప్పుడున్న ఈ చెరసాల అధికారికే, ఈ సంగతి తెలియదు. ఇటువంటి చెరసాలలు కట్టించే వారికి తప్పించి ఎవరికీ ఈ రహస్యం తెలియదు, అని ఆలోచిస్తూ వుంటే, వెనుక నుండి భుజం మీద చెయ్యి వేశాడు యోసేపు. థేమాను ఉలిక్కి పడ్డాడు. మరుగునపడిన చెరసాల గదిలో నుండి ఎవరో ఖైదీ ఖైటకు వచ్చినట్లుగా అనిపించింది. “ఇంత ధైర్యవంతుడు, థేమాను ఎందుకు అంతగా ఉలిక్కిపడ్డాడు?” అనుకున్నాడు యోసేపు.

సాయంకాలం పనుల సమయమయ్యింది. థేమాను, యోసేపు కలసి చెరసాల ఆవరణములోని ఖైదీల వైపుగా వెళ్ళిపోయారు. యోసేపు మనస్సు థేమాను చెప్పిన పిరమిడ్ మీదకి వెళ్ళింది. ఆ పెద్ద పిరమిడ్ మీదకు వెళ్ళిచూడ వచ్చునని థేమాను చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. తను విడుదలైతేనే కాని ఆ భాగ్యం తనకు కలుగదు. ఈ పిరమిడ్లు తన పితరుడైన హనోకు కట్టియుంటే ఇప్పుడు వాటి వయస్సు దాదాపు రెండువేల సంవత్సరాలు దాటి ఉంటుంది. ఒళ్ళంత పులకరించినట్లయింది. సాయంకాల మైంది. స్నానం చేయాలి అనుకున్నాడు. ఇంతలో చెరసాల అధికారి వచ్చాడు. కొంచెంసేపు యోగక్షేమాలు విచారించిన తర్వాత “ఇంక నెలరోజులలో ఫరో యొక్క జన్మదినము

వస్తుంది. కనుక అనేక కార్యక్రమాలు నిర్వహించవలసి యున్నందున చెరసాలకు తొందరగా రాను" అని యోసేపుకు చెప్పి వెళ్ళిపోయాడు. భోజనాలు అయిన తర్వాత యోసేపు, థేమాను ఇద్దరు కలసి భోజనం చెయ్యటానికి కూర్చున్నారు. థేమాను యోసేపును చూసి "మీకు ఈ చెరసాల బాధ్యత బాగుందా?" అని అడిగాడు. "బాగుంది. అంటే సమయాన్ని సద్వినియోగం చేసినట్లుగా అనిపిస్తుంది. అదీకాక పైనున్న చెరసాలల్లో అయితే ఏదైనా ఒకపని చెయ్యవచ్చు కాని ఈ భూమి క్రింద ఉండే చెరసాలల్లో మనల్ని సోమరులను చేస్తుంటారు" అన్నాడు.

"చెరసాలలో ఉన్న వ్యక్తులు ఎంతమంది? ఎన్ని గదులలో ఎంత మంది ఉన్నారు? ఎంతమంది ఖైదీలు ఉంటే ఎన్ని గిన్నెల భోజనం సరఫరా చేయబడుతుంది? అనే సంగతి ఆలోచించారా?" అని అడిగాడు థేమాను.

"ఇందులో ఆలోచించడానికి ఏముంది? చెరసాల అధికారి చెరసాలలోని మనుష్యులను నా కప్పగించినప్పుడు ఎంతమంది ఉన్నారో, ఇప్పుడూ అంతమందే ఉన్నారు. ఏమి మార్పులు చేయలేదు కదా!" అన్నాడు యోసేపు.

"నిజమే కానీ కొన్ని మార్పులు ఇక చేయవలసి వస్తుంది" అన్నాడు థేమాను.

"ఎందుకు?" అని యోసేపు అడిగాడు.

"ఎందుకంటే ఇక్కడ పనిచేసే అధికారి, బంట్రోతు, సిపాయి గదిలో బంధింపబడిన ఖైదీ కూడా మెదడు ఉపయోగించకుండా నోరు మూసుకొని, కళ్ళు మూసుకొని జీవించాలన్న ఆజ్ఞకు బద్ధులై యున్నారు. కాని నువ్వు రాజు యొక్క ఉద్యోగివి కాదు కాబట్టి స్వతంత్రుడైన ఖైదీలాగ ఆలోచించు. కళ్ళు తెరచి చూడు. చాలా క్రొత్త విషయాలు అర్థమౌతాయి. నేను ఈ చెరసాలలోని అన్ని గదులను చూడలేదు, కాని ఇటువంటి చెరసాలలు నిర్మించాను. ఆ చెరసాల కట్టిన విధానం నాకు తప్ప ఆ చెరసాలలో ఉన్న ఖైదీలకుగాని, దాని అధికారులకుగాని తెలియదు. అలాగే ఇక్కడ మనం పైకి చూస్తున్నదంతా కూడా యధార్థం అని అనటానికి వీలులేదు" అన్నాడు థేమాను.

యోసేపు కొంచెం ఆలోచించి, "అయితే ఇప్పుడేం చెయ్యమంటావు?" అని అడిగాడు.

"ఏమీలేదు. ముందు ఈ చెరసాలలో ఎందరు ఖైదీలు వున్నారు? ఎన్ని గదులు వున్నాయి? ఆ గదులు ఎక్కడెక్కడ వున్నాయి? అనే పటాలు చూద్దాము పద" అన్నాడు అధిపతి గదిలోకి వెళుతూ.

అనవసరమైన పని అని అనుకున్నా, థేమాను మాట కాదన లేదు. ఆ చెరసాలలోని గదులను చూపించే కాగితపు పటాన్ని బల్లమీద పరచాడు. మొత్తము నలభై గదులు, అరవై తొమ్మిది మంది ఖైదీలు ఉన్నారు. ఈ అరవై తొమ్మిది మంది కూడా ఏ గదిలో ఎందరు ఉన్నది వేరే పటం చూపిస్తుంది. దానిని కూడా బల్లపై పరచి, థేమాను వైపు చూసాడు. 'తర్వాత ఏమి చెయ్యమంటావు?' అన్నట్లుగా...

"ఇప్పుడు ఎన్ని భోజనాలు తయారు చేయబడి గదులలోకి పంపించబడు తున్నాయో చూడాలి" అని వేరొక కాగితం యోసేపు చేతిలో పెట్టాడు.

ఒక అరగంటసేపు యోసేపు, థేమాను ఆ కాగితమును జాగ్రత్తగా చూశారు. చెరసాలలోని నలభై గదులు చతురస్ర ఆకారంలో నిర్మించబడ్డాయి. అందులోని నాలుగు భుజాలలో పదిగదులు ఉన్నవి. పదియవ గదిలో ఒక ఖైదీ ఉన్నాడు. కాని మూడు భోజనాలు అతనికి ఇవ్వవలసినదిగా ఆజ్ఞ అయినది. అదే విధంగా ముప్పవ గదిలో ఒకఖైదీ ఉన్నాడు. కాని అతనికి రెండు భోజనాలు ఇవ్వవలసినట్లుగా ఉంది. ఈ విధంగా భోజనాలు అందించబడిన రెండు గదులు మూలలలో ఉండటం గుర్తించి చెరసాల భక్ష్యాధికారిని పిలిపించారు. అప్పటికి రాత్రి పది గంటలు కావస్తుంది. ఆ అధికారి వచ్చి కూర్చున్నాడు. యోసేపు తనకు వచ్చిన అనుమానాన్ని అతనికి చెబితే....

"అవన్నీ మాకు తెలియవు. మాకు వచ్చిన ఉత్తర్వులలో పదవ గదిలో ఉన్న ఖైదీ మూగవాడు, గ్రుడ్డివాడు. అతనికి ప్రతి భోజనమునకు ముగ్గురి భోజనము ఇవ్వవలసినది అని ఆజ్ఞ" అన్నాడు.

"ఈ ఆజ్ఞ ఎంతకాలం క్రితం జారీ చేయబడింది?"

అని అడిగాడు యోసేపు.

“నేను ఈ చెరసాలకు బదిలీ అయి మూడు సంవత్సరాలు అయింది. నాకంటే ముందు ఉండిన అధికారి నాకిచ్చిన ఆజ్ఞలలో ఉన్న విధంగా నేను ఆహారం సరఫరా చేస్తున్నాను. కాని ఆ గదిలో ఉన్న ఆ ఖైదీకి పెరిగిన వెంట్రుకలు, గోళ్ళు చూస్తుంటే అతడు ఆ గదిలో పది సంవత్సరాలయినా గడిపి ఉండాలి” అని అన్నాడు. “అదే విధంగా ముప్ఫైయవ గదిలోని ఖైదీ కూడా పది సంవత్సరాల క్రితం చెరసాలలోకి వచ్చేటప్పుడే అతను కూడా మూగ, గ్రుడ్డివాడిగా వచ్చాడు” అని అన్నాడు. కనుక ఇందులో ఏదో మర్మము ఉంది అని అనుకున్నాడు యోసేపు. ఉదయం వరకు వేచియుంటేనే కాని ఈ మర్మము బయటకు రాదని అనుకున్నాడు. థేమానుతో కలసి ఉదయం భోజనం పెట్టేటప్పుడు పదవ గది వెలుపల వేచి ఉన్నాడు.

పదవ గది ఖైదీ మూడు భోజనాల గిన్నెలు తీసుకొని ఒకటి తన కొరకు క్రింద ఉంచి, మిగిలిన రెండు గిన్నెలతో వెళ్ళి గది వెనుక భాగంలో మూలలో ఉన్న సన్నని, పొడుగాటి రంధ్రము వద్ద నోటితో సన్నగా అరిచాడు. ఆ అరుపు జాగ్రత్తగా గమనించిన వారికే అర్థమవుతుంది. కొంచెం సేపటికి అవతలి నుండి అదే స్వరం కొంచెం బలహీనంగా వినిపించింది. అప్పుడు మూగఖైదీ తన చేతిలోని గిన్నెలను ఒకదాని తర్వాత ఒకటి ఆ సందులో గుండా అవతలికి అందించాడు. తర్వాత మంచినీళ్ళు అందించాడు. తర్వాత తను భోజనమునకు ఉపక్రమించాడు.

యోసేపు, థేమాను వెంటనే చెరసాల అధిపతికి కబురుచేసి ఆయన వచ్చిన తర్వాత విషయం మొత్తం విశదీకరిస్తే అధికారి ఆశ్చర్యపోయాడు. ఈ సంగతి విచారించి ఏదైనా ఒక నిర్ణయం తీసుకొనదగినవాడు పోతీఫరుగారు మాత్రమే. కనుక ఆయనకు తెలియ చేయడానికి అధికారి వెళ్ళాడు. సాయంకాలం అధికారి, పోతీఫరు, పనివారితో గడ్డపారలు మొదలయినవి తీసుకొని వచ్చారు. అందరూ కలసి వెళితే, పనివారు గడ్డపారలతో పదవ గది వెనుకవైపు గోడ కొద్దికొద్దిగా జాగ్రత్తగా తొలగిస్తే, కాగడాల వెలుగును చూసిన ఇద్దరు మనుష్యుల వంటి జంతువులు పెద్దగా అరచి మూలన అతుక్కుపోయారు. ఆ వాసన భరించలేక పోతీఫరు బయటకు వచ్చాడు.

కొంచెంసేపటికి కళ్ళు, ముక్కు, నోరు, అరికాలు అన్నీ ఒకటిగా ఉండి వస్త్రములు శరీరాన్ని అంటుకొనిపోయి కళ్ళు వెలుతురు చూడలేక, పొడవాటి గోళ్ళు కాళ్ళకి, చేతులకు వ్రేలాడుతుండే ఇద్దరిని బయటకు తీసుకొని వచ్చారు. వాళ్ళు ఆడవాళ్ళా, మగవాళ్ళా తెలియకుండా ఉంది. అదే విధముగా ఇరవై, ముప్పై, ముప్పైఒకటవ గదుల వెనక గోడలు తొలగించితే, ఇరవయ్యవ గదిలో మాత్రము ఒక ఖైదీ పదవ గదిలోని ఖైదీవలె ఉన్నాడు. మిగిలిన వారిని అందరిని వైద్యుల వద్దకు పంపించారు. ఈ ఐదుగురు ఖైదీల పత్రాలు వెదికితే దొరకలేదు. కనుక వీరి మీద ఎవరో చాలా సంవత్సరాల క్రితం పగ తీర్చుకోవటానికి ఈ శిక్ష విధించి ఉంటారు అనుకున్నారు. **(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు



(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

తన అనుచరులందరిని కర్మేలు వెళ్ళమని చెప్పాడు. తాను ఎక్కడికి వెళ్తుంది వాళ్లకు చెప్పలేదు. కొద్దిరోజులు ఒంటరిగా దైవధ్యానంలో ఉంటానని మాత్రం చెప్పాడు. ఇక ఆయనతో వాదించటానికి ఎవరికి ధైర్యం లేదు. హెబ్రోను వరకు వారితో కలసి వచ్చిన దావీదు దెబీరు వైపు ఒంటరిగా బయలుదేరాడు.

తన గుఱ్ఱం మీద బెయేర్షెబా మీదుగా పారాను అరణ్యంలోని సీనాయి పర్వతం వద్దకు వచ్చాడు. సీనాయి వద్దనే దేవుడు మోషేతో మాట్లాడాడు. అక్కడ ఒక గుహలో విశ్రమించాడు. తన మనస్సు ఇప్పుడు ఎంతో నెమ్మదిగా ఉంది. సౌలు వలన అపాయం తొలగిపోయింది. సమూయేలు మరణంతో ఇశ్రాయేలీయులకు ప్రవక్త లేదు. తర్వాత దేవుడు ఎవరిని ప్రవక్తగా నియమిస్తాడో.

నలభై రోజుల తర్వాత యెజ్రెయేలు వచ్చిన దావీదుకు నిరాశే ఎదురైంది. తన అనుచరులలో చాలా మంది క్రమశిక్షణలో లేరు. కష్టపడి సంపాదించనందు వలన దండు వారికి ఆహారం కూడా సరిగా లేదు.

యాషాబీనును పిలిచాడు.

‘‘మనం కర్మెలులో ఉన్నప్పుడు నాబాలు అనే ధనవంతుని పశువులను ఎంతో జాగ్రత్తగా కాచి యున్నాము. అతని దగ్గరకు కర్మెలు వెళ్ళిరా!" అన్నాడు దావీదు.

"నాబాలు ఇప్పుడు కర్మెలులో లేదు. తన గొఱ్ఱెల బొచ్చు కత్తిరించుటకు అరణ్యంలో వున్నాడు" అన్నాడు యాషాబీను.

"అంటే పండుగ చేసుకుంటున్నాడన్నమాట. అయితే మీరు పదిమంది కర్మెలునకు నాబాలు నొద్దకు పోయి నా పేరు చెప్పి కుశల ప్రశ్నలడిగి ఆ భాగ్యవంతునితో నీకును నీ ఇంటికిని నీకు కలిగిన అంతటికిని క్షేమమగును గాక! అని పలికి ఈ వర్తమానము తెలియచెప్పవలెను. నీ యొద్ద గొఱ్ఱెల బొచ్చు కత్తిరించు వారున్నారను సంగతి నాకు వినబడెను. నీ గొఱ్ఱెల కాపరులు మా దగ్గరనుండగా మేము వారికి ఏ కీడును చేసి యుండలేదు. వారు కర్మేలులో నున్నంత కాలము వారేదియు పోగొట్టుకొనలేదు. నీ పనివారిని నీవు అడిగిన యెడల వారాలాగు చెప్పుదురు. కాబట్టి నా పనివారికి దయచూపుము. శుభదినమున మేము వచ్చితిమి గదా! నీకిష్టము వచ్చినట్లు నీ దాసులకును నీకుమారుడైన దావీదునకు ఇమ్ము" అని చెప్పి వారిని పంపించాడు.

యాషాబాను, తొమ్మిది మంది పనివారిని తీసుకొని గాడిదల మీద కొన్ని సంచులు తీసికొని కర్మెలు బయలుదేరాడు. తన పనివారిని పెద్దపెద్దగా దుర్భాషలాడుతూ గొఱ్ఱెబొచ్చును గోతాలలో పెట్టిస్తున్న నాబాలు గాడిదల మీద తన యొద్దకు వస్తున్నవారిని విసుగుగా చూశాడు. గబగబా వారి వద్దకు వచ్చి "ఎవరయ్యా మీరు ఇక్కడ మీకేమి పని" అన్నాడు.

యాషాబాను గాడిద మీద నుండి దిగి గౌరవంగా నాబాలుకు వందనం చేశాడు. దావీదు చెప్పిన మాటలన్నీ చెప్పాడు. మిగిలిన అనుచరులు ఒక చెట్టు క్రింద కూర్చుంటే హనాను వారి దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

"యెష్షయి కుమారుడు దావీదుగారు బాగున్నారా?" అని అడిగాడు.

"దావీదు ఎవడు?" అని గర్జించినట్లుగా అరిచాడు నాబాలు.

"యెష్షయి కుమారుడు ఎవడు?" అని యాషాబాను దగ్గరగా వచ్చాడు. తన యజమానులను విడిచి పారిపోయిన దాసులు ఇప్పుడు అనేకులు ఉన్నారు. కొంచెం ఆగి తనవైపు చూస్తున్న తన పనివారితో "మీ పని కానివ్వండి" అని గదిమాడు.

"నేను సంపాదించుకున్న అన్నపానములను, నా గొఱ్ఱెల బొచ్చు కత్తిరించు వారి కొరకు నేను వధించిన పశుమాంసమును తీసి నేను బొత్తిగా ఎరుగని వారికిత్తునా?" అన్నాడు.

ఈ మాటలకు యాషాబాను తన కత్తిమీద చెయ్యి వేశాడు. కూర్చున్న మిగిలిన వారు కూడా అలానే. కాని ఒక్క నిమిషము ఆలోచించాడు. దావీదు దగ్గరకు రాక ముందైతే ఇప్పుడికిప్పుడే నాబాలును రెండు ముక్కలు చేసేవాడు. వెంటనే వెనుకకు తిరిగి, పనివారితో "పదండి" అన్నాడు. వాళ్ళు కదలలేదు.

"పదండి, దావీదు నిర్ణయమే మన నిర్ణయం" అని నెమ్మదిగా అన్నాడు.

హనాను నాబాలు గమనించక ముందే చెట్టుచాటుకు వెళ్ళి తన గాడిదనెక్కి నాబాలు ఇంటివైపు గాడిదను తొందరగా అదిలించాడు.

ఇప్పటికి నాలుగురోజుల నుండి ఉదయం చీకటితో లేచి పనివారికి పనులు పురమాయించి గొఱ్ఱెల బొచ్చు కత్తిరించేవారికి వేయించిన మాంసం, ధాన్యం సిద్ధపరచ టంతో తలమునకలైపోతుంది అబీగయీలు.

తన వయస్సు ఇప్పుడు ఇరవైరెండు సంవత్సరాలు. తనకు వివాహమైన ఈ రెండు సంవత్సరాలలో గొఱ్ఱెలను బొచ్చు కత్తిరించే ఈ పండుగ పదిరోజులు ఇలాగే వుంటుంది.

తన తల్లిదండ్రుల ఇంట ఇటువంటివి ఎరుగదు. వారు బీదవారు. సాధారణంగా ఇశ్రాయేలు కన్యలకు ఇరవై సంవత్సరాలు నిండకముందే వివాహం జరిగిస్తారు. కాని బీదలైన తల్లిదండ్రులు తన వివాహమునకు కావలసిన స్తోమత కలిగి యుండలేదు. తాను చాలా అందగత్తెనని తన స్నేహితురాండ్రు తనను 'రాణి' అని ముద్దుగా పిలిచేవారు. ఎప్పటికైనా రాజంత గొప్ప పెనిమిటి వస్తాడని ఏడ్పించేవారు.

కాని తన వివాహ వయస్సు దాటిపోతుంటే నాబాలు వచ్చాడు. వివాహమునకు తనని అడిగాడు. అతని పేరు నాబాలు అని తెలిసినప్పుడు అతని రూపమునకు తగిన పేరే అనుకుంది. నాబాలు అంటే వెర్రివాడు. నిజముగానే నలభై సంవత్సరాల నాబాలు బహు మొరటుగా ఉన్నాడు. అటువంటి వానికి తనను తన తల్లిదండ్రులు వివాహము నకియ్యరు అనుకుంది. అతనితో వివాహము నిశ్చయమై నదని తెలిసినప్పుడు తాను నిశ్చేష్టురాలైనది.

స్థితిమంతుడైన అతనికి కలిగిన పశువుల మందల పనివారు తనను ఎంతో ఆదరముగా చూచారు. తాను కూడా పనివారిని అలాగే దయగా చూచినది. నాబాలుకు సమీప బంధువులు కాని, దాయాదులు కాని లేరు. అతని ఆలోచనలన్ని ఆస్తి సంపాదన మీదనే. బంగారము, వెండి కూడా చాలా కూర్చాడు. కాని ఏనాడు ఎవరికి సహాయం చేసి ఎరుగడు. పనివారిని కూడా బహు బాధలు పెడతాడు.

సమయము మించిపోతున్నది. రొట్టెలు చేసేవారిని త్వరపెట్టింది. అందరూ శ్రమిస్తునే ఉన్నారు. నాబాలు కోపం అందరికి తెలుసు.ద్రాక్షారస తిత్తిలో ద్రాక్షారసం పోస్తున్నారు. తాను పంచలో నిలుచుని చూస్తుంది.

హనానుకి దాదాపు అరవైఐదు సంవత్సరాల వయస్సు వుంటుంది. ఎంతో నమ్మకమైన వాడు. నాబాలు అతనికి ఒక్కనికే కొంచెం గౌరవం ఇస్తాడు.

వీధి మలుపు తిరిగి గార్ధభంపై తొందరగా వస్తున్న హనానును చూచి ఆశ్చర్యపోయింది. అతని ముఖంలో ఆదుర్దా, భయము కనబడుతున్నాయి. గాడిదను దిగిన హనాను గబగబ తన కొరకై రావడం చూచి భయపడింది. నాబాలుకి ఏమైనా అపాయమా,అడవి దొంగలు ఏదైన హాని కలిగించారా? అనుకుంటూ బయటికి వచ్చింది.

"అంతా క్షేమమా?" అని ఎదురుపోయి అడిగింది. హనాను తలవూపి "అమ్మా ఇటు రండి" అని పంచలోనికి దారి తీశాడు.


"అమ్మా, దావీదుగారిని, అతని మనుష్యులను గూర్చి ఇంతకు ముందు మీకు నేను చెపుతుండే వాడిని కదా!" అన్నాడు.

"ఔను, గొల్యాతును చంపిన వాడు కదా!" అంది అబీగయీలు.

**(సశేషం)**



# 'మీరేమాలోచిస్తున్నారు?'



మనం ఔనన్నా, కాదన్నా, ఒప్పుకున్నా, ఒప్పుకోక పోయినా, ఆరు నూరైనా, నూరు ఆరైనా మనల్ని నడిపించేది పక్కాగా మన ఆలోచనా విధానమే. మనం రోజంతా ఏం ఆలోచిస్తుంటామో దాని ప్రభావం మన జీవితం మీద తీవ్రంగా ఉంటుంది. మనం నిద్ర లేచినప్పటి నుండి మన గురించే ఆలోచిస్తుంటాము కాబట్టి మిగతా ప్రపంచాన్ని గురించి పట్టించుకోము. మన కుటుంబం, పిల్లలు, బంధువులు, స్నేహితులు ఇదీ మన ప్రపంచం. మన ప్రపంచానికి మనమే మహారాజులం, మహా రాణులం. మన ప్రపంచంలో దేవునికి ఒక చిన్న గుడి కట్టి దేవున్ని ఆ గుడి వరకే పరిమితం చేస్తాము. ఈ సృష్టి మొత్తాన్ని సృష్టించిన దేవుడికి మనం ఇచ్చే స్థానం అంతవరకే. అందుకే దేవుడు మన జీవితాలను కూడా మన ప్రపంచం వరకే పరిమితం చేస్తాడు. మన ఆలోచనా విధానం మారాలి. మన పుట్టుక గురించి ఆలోచించాలి, మన సృష్టికర్తను గురించి, సృష్టిలో చేయబడిన వాటి గురించి ఆలోచించాలి. ఈ భూమి, అంతరిక్షము, సముద్రాలు, పక్షులు, జంతువులు ఇంకా చాలా ఉన్నాయి కదా! వాటి గురించి ఆలోచించి నప్పుడే దేవుడు ఎంత గొప్పవాడు, ఆయన యొక్క శక్తి సామర్థ్యాలు, ఆయన మనకోసం ఏం చేశాడు? ఏం చేస్తాడు అనేది తెలుస్తుంది. దేవుడంటే మనకు ఒక అవగాహన వస్తుంది. 'యెహోవా, నీ కార్యములు ఎన్నెన్ని విధములుగా నున్నవి? జ్ఞానముచేత నీవు వాటన్నిటిని నిర్మించితివి. నీవు కలుగజేసిన వాటితో భూమి నిండి యున్నది' (కీర్తన. 104:24) అని దేవుని గురించి, సృష్టిని గురించి ఆలోచించబట్టే దావీదు ఆ మాటలు పలికాడు. దావీదు అనుక్షణం దేవుని గురించి ఆలోచిస్తు న్నందువల్లనే అనేక కీర్తనలు వ్రాయగలిగాడు. అందుకే దావీదు దేవుని హృదయానుసారుడు అవ్వగలిగాడు. మనం ఒంటరిగా ఉన్నప్పుడు మన గురించో, మనకిష్టమైన వారి గురించో ఆలోచిస్తుంటాము. మన గురించి మనం ఆలోచిస్తుంటే మనకి మనఃశ్శాంతి ఉండదు. అందుకే మనం దేవుని గురించి, ఆయన అదృశ్య లక్షణాలను గురించి, ఆయన నిత్యశక్తిని గురించి ఆలోచించాలి. దేవుడు మన కొరకు సిద్ధపరచి ఇచ్చిన బైబిలు గ్రంథమును సంపూర్తిగా చదివి, దానిని గురించి ధ్యానిస్తుంటే మనం రోజంతా దేవుని గురించి ఆలోచిస్తూనే ఉంటాము. అనేకమంది బైబిలును చదువుతారే కాని దానిని గురించి ధ్యానము చేయరు. ఈ లోక సంబంధమైన విషయాల గురించి ఆలోచించేటప్పుడు వాటికి అనుగుణంగానే మన జీవితం సాగుతుంది. ఈ లోకము మనకి ఎప్పటికీ మనఃశ్శాంతిని ఇవ్వనప్పటికీ లోకసంబంధమైన విషయాల గురించే ఆలోచిస్తుంటాము. ఈ లోక సంబంధమైన ఆలోచనలను నియంత్రించుకోవడమే ఈ లోకాన్ని జయించడం. 'యెహోవా ధర్మశాస్త్రము (బైబిలు)నందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు' (కీర్తనలు 1:2). బైబిలు గ్రంథమును దివారాత్రము ధ్యానము చేయనప్పుడు మన ఆలోచనలన్నీ ఈ లోకసంబంధంగానే ఉంటాయి. మనం ఎంతసేపటికి తిండి గురించి, బట్ట గురించి, ఎలా బ్రతకాలా అని భవిష్యత్ గురించి ఆలోచిస్తుంటే మనం సంతోషంగా ఉండలేము. ఈ లోకానికి భిన్నంగా ఆలోచించడానికి ప్రయత్నించండి. మీరు దేవుని గురించి, దేవుని విషయాల గురించి ఆలోచిస్తుంటే దేవుడు మీ గురించి ఆలోచిస్తాడు. ప్రపంచంలో ఉన్న సోది గురించి ఆలోచించడం వలన మీకు ఏమి ప్రయోజనం? దేవుని గురించి ఆలోచిస్తుంటే మీరు సంతోషంగా ఉంటారు. మరి 'మీరేమాలోచిస్తారు?' అన్నది మీ ఇష్టం.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# నిన్ను నీవు హెచ్చించుకొనవద్దు

ఈ భూమ్మీద పుట్టిన ప్రతివాళ్ళు గొప్పగా బ్రతకాలని కోరుకుంటారు. అందుకు తగ్గ ప్రయత్నం చేస్తుంటారు. మనుష్యులు వాళ్ళని మెచ్చుకోవాలని కోరుకుంటారు. ఇతరులను చూసి ప్రేరేపితులవుతుంటారు. మనుష్యుల ముందు ఘనంగా ఉండాలని, ఎవరూ తనను తక్కువగా చూడకూడదని అనుకుంటారు. ఇదంతా లోకానుసారమైన మనస్సు. శరీర సంబంధమైనది. శరీరానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చుకోవడం వలన అలాంటి మనస్సు వస్తుంది. కాని ఆత్మ దేవునికి సంబంధించినది. శరీరం మట్టిలో కలిసిపోతుంది, ఆత్మ దానిని అనుగ్రహించిన దేవుని దగ్గరకు వెళ్తుంది. 'మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును' (ప్రసంగి 12:7). మనం చనిపోతాము, తర్వాత మన శరీరం మట్టిలో కలిసిపోతుంది అన్న ఊసే లేకుండా ఉండేవాళ్ళు శరీర విషయాలపై అత్యంత ఆసక్తి కలిగి ఉంటారు. కానీ మనం బ్రతికి ఈ లోకంలో జీవించగలుగుతున్నామంటే మనలో ఆత్మ ఉండబట్టే కదా. మరి ఆ ఆత్మను గురించి ఎవరూ పట్టించు కోరు. ఎంతసేపటికి శరీరాన్ని సుఖపెట్టటం గురించే ఆలోచిస్తుంటారు. అందుకే గొప్పగా ఉండాలని అనుకుంటారు. గొప్పగా ఉండాలనుకునే వాళ్ళెవరికీ తగ్గింపు గుణం ఉండదు. మనుష్యుల ద్వారా ఘనత కోరుకొనే వారికి తగ్గించుకొనే గుణం ఉండదు. తమకి గొప్పతనం ఆపాదించుకొనే వారు ఇతరుల మీద ఆధిక్యత కోరుకుంటారు. అలాంటి వారికి తగ్గించుకొనే గుణం రావడం అసాధ్యం. ఆత్మాను సారమైన మనస్సు ఉండేవాళ్ళు తమని తాము తగ్గించుకుంటారు. ఆత్మానుసారమైన మనస్సు దేవున్ని ప్రేమించే వాళ్ళకి మాత్రమే ఉంటుంది. దేవున్ని ప్రేమించే వాళ్ళు ఈ లోకంలో తమ శరీరానికి అంత ప్రాధాన్యత ఇవ్వరు. శరీరానుసారమైన మనస్సు ఉండేవాళ్ళు వాళ్ళ గురించే తప్ప మిగతా ప్రపంచం గురించి పట్టించుకోరు. ఎవరు ఏమైపోయినా వాళ్ళలో చలనం ఉండదు. 'ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది' (మత్తయి 5:3) అని యేసుప్రభువు చెప్పిన వాక్యము అర్థము అదే. చావు గురించి వారికి తెలియని భయం ఆవరిస్తుంది. అందుకే చావు గురించి ఆలోచించడానికి ఇష్టపడరు. ఎవరైతే తాము చనిపోయిన తర్వాత తమ ఆత్మ ఏమవుతుంది అనే విషయమును గూర్చి ఆలోచిస్తుంటారో వారికి దీనత్వము వస్తుంది. వారు తమ్మును తాము హెచ్చించుకోలేరు. దేవున్ని ప్రేమించే వారికి ఆత్మానుసారమైన మనస్సు ఉంటుంది కాబట్టి వాళ్ళు వాళ్ళ శరీరానికి అంత ప్రాధాన్యత ఇవ్వరు. వాళ్ళకి తగ్గింపు గుణం ఉంటుంది. కాబట్టి వాళ్ళు ఇతరులను ప్రేమిస్తారు. తమ్మును తాము తగ్గించు కున్నప్పుడు హెచ్చింపబడటం, హెచ్చించుకున్నప్పుడు తగ్గించ బడటం అనేది ఈ లోకానుసారమైనది కాదు. తమ్మును తాము తగ్గించుకున్నవాళ్ళు దేవునిచే హెచ్చింపబడతారు హెచ్చించు కున్న వాళ్ళు దేవునిచే తగ్గించబడతారు. దీనమనస్సు, విరిగి నలిగిన హృదయం కలిగి ఉండటం, మనల్ని మనం తగ్గించు కోవడమనేవి మనల్ని పరలోక రాజ్యమునకు వారసులను చేస్తాయి. కాబట్టి దేవుని ముందు మనల్ని మనం తగ్గించుకొని జీవిద్దాం. నీవు దేవునిచే హెచ్చింపబడాలంటే, మనుష్యుల యెదుట నిన్ను నీవు తగ్గించుకొని జీవించాలి.


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లో పీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# మధ్యకాలము

ఆ విధముగా తిరిగి ఇంటికి వెళ్ళెను. అతడు తిరిగి యూదయ ప్రవేశించగానే తిమోతియస్ అను ఆ ప్రాంతపు గవర్నరు ఒకడు గొప్ప సైన్యముతో అతనిని వెంబడించెదనని నటించెను. కాని యూదా అతనిపై పడి అతనిని కత్తితో కోయుచు ఎఫ్రాయీము గోత్రములో నున్న గజారా పట్టణం వరకు అతనిని తరిమెను. తిమోతియస్, కెరియస్ అనువారిని ఫేనిస్సు సిరియా సైన్యపు పెద్ద అధికారిని హతమార్చెను.

ఈ విషయము గిలాదు చుట్టూ ఉన్న అన్యదేశపు ప్రజల కుట్రకు కారణమాయెను. తోబు మాసమందు మొదటి దినమున యూదులపైబడి ఒక వెయ్యిమందిని చంపి వారి సామాగ్రిని తీసికొని వారి భార్యాపిల్లలను చెరగొని పోయిరి. మిగిలిన కొద్దిమంది గిలాదులోని "డెమెటా" అను గొప్ప దుర్గములోనికి పారిపోయిరి. తూరు సీదోనియులు టోలమీ యస్ ద్వారా గలలియలోనున్న యూదులనందరిని చంపుటకై కుట్రచేయుచుండగా గజరా వద్ద చంపబడిన తిమోతియస్ కుమారుడు గొప్ప సైన్యముతో వారిని ముట్టడి వేసెను.

యూదా ఈ క్లిష్టపరిస్థితిలో సన్హెద్రిన్ సభ యొక్క ఆలోచన ద్వారా సైన్యమును మూడు భాగములుగా చేసి అతను 8000 మంది పురుషులతో అతని సోదరుడైన యోనాతాను 3000 మంది పురుషులతో గలిలయలోనికి నడుచుచూ వెళ్ళిరి. అతని సోదరుడైన యోసేపు యెరూషలేమును, చుట్టూ ఉన్న దేశమును కాపాడుటకు యూదా సీమోనులు తిరిగి వచ్చువరకు ఉంచబడెను.

వారు గిలాదుకు వెళ్ళుచుండగా ఎదోమియుల పట్టణమైన బాస్కోరాన్‌ను ఎదుర్కొని వానిలోని పురుషుల నందరిని చంపి దానిని దోచుకొనిరి. దెతీమా పట్టణమును వశపరచుకొని బందీలుగా ఉన్న అనేకమంది యూదులను విడుదలచేసి ఆ పట్టణమును కాల్చివేసిరి. వారు రాత్రివేళ నడుచుచు దెతీమా పట్టణము ముందుకు రాగా సోదరులందరు గొప్ప హింసాకాండతో తిమోతియస్ పైబడి అతని సైన్యము పారిపోవునట్లు చేసెను. మరియు 8000 మందిని వెంటాడి చంపిరి. వారు తిరిగి ఎక్కడెక్కడ యూదులు చెరపట్టబడి, బలత్కారము చేయబడుట చూచెనో బాస్కరాన్లో జరిగించినట్లు వారందరిని విడుదల చేసెను.

అదే సమయంలో సీమోను అనేక పర్యాయములు గలలియలోని శత్రువులనందరిని ఓడించి దేశము నుండి పారద్రోలెను. కాని యోసేపు, ఆజ్ఞలకు వ్యతిరేకముగా యెరూషలేమును విడచి సిరియా గవర్నరైన గార్గియాస్ దగ్గరకు పోయి మధ్యధరా సముద్రము యొక్క రేవు పట్టణమైన జామ్నియా మీదకు చెడు హృదయముతో దండయాత్ర చేయుట వలన రెండువేల మంది పురుషులను కోల్పోయెను.

లిసియాస్ ఈ సమయంలో ఎనిమిది లక్షలమంది జనములను, ఎనభై ఏనుగులను రాజ్యములో ఉన్న గుర్రములన్నింటిని పోగుచేసి వ్యక్తిగతముగా ఆ హెబ్రీ జయశాలి మీదకు దండయాత్ర చేసెను. యూదా బెతునాను ముట్టడి వేయునప్పుడు అతనిని పట్టుకొని 11,000 వేలమంది మనుష్యులను, 16 వందల గుర్రములను చంపి మిగిలిన వారిని పారిపోవునట్లు చేసెను.

ఈ విజయము యూదా మరియు లిసియాస్ మధ్య ఆ యువరాజు పేరిట సమాధానము చేకూర్చెను. దీనివలన ఎపిఫనేస్ ద్వారా అన్యులతో సమానము చేయబడిన చట్టమును త్రోసివేసి యూదులు వారి మతసంబంధమైన చట్టప్రకారమే జీవించునట్లు అనుమతించెను.

ఏమైనా ఈ సమాధానము అతి త్వరలోనే యొప్పే జామ్నియా ప్రజల ద్వారా పడగొట్టబడెను. వారు యూదులను భయంకరంగా హింసించి చంపిరని యూదాకు తెలిసిన వెంటనే రాత్రి వేళలో వారి రేవు మీద పడి వారి నౌకలన్నింటిని కాల్చివేసెను. మరియు మంటలు తప్పించుకొనిన వారిని కత్తితో చంపెను. తర్వాత జామ్నియా ఓడరేవును కాల్చివేసి అందులోని నౌకలన్నింటిని తగులబెట్టెను. **(సశేషం)**

# సాక్ష్యము హృదయాలను లక్ష్యముంచు ప్రభువు

నా పేరు నారాయణమ్మ. నేను విగ్రహారాధన ప్రాధాన్యత గల హిందూ సాంప్రదాయ కుటుంబంలో జన్మించాను. నాన్న గారి మరణం వల్ల పోషణ భారం అంతా అమ్మ అమ్మాజీదే. ఆమె ప్రభువును నమ్మి బాప్తిస్మం తర్వాత పేరు మరియమ్మగా పేరు మర్చుకున్నది. నా పేరు మార్తమ్మగా మారింది.నా భర్తపేరు సత్యనారాయణ. బాప్తిస్మం తరువాత బోయజుగా మారారు. నాకిద్దరు కుమారులు. పెద్దవాడు సతీష్ రెండవ వాడు అనిల్. అనిల్ రక్షింపబడ్డాడు. ఆర్థిక ఇబ్బందులవల్ల మేము చాలా నలిగిపోయాము. మా భారమంతా అమ్మ భరించేది. భర్త చిన్న వ్యాపారి వద్ద గుమాస్తాగా ఉండేవారు. అమ్మ యింట్లో రెండు చిన్న గదులు మాకివ్వగా దానిని సర్దుకొని ఒక గది పూర్తిగా ప్రభువు ప్రార్థనా గదిగా ప్రత్యేకించాము. అమ్మపై ఆధారపడడం చిన్నతనంగా ఉండేది.

మా అమ్మకిద్దరమే సంతానము, నేను మా అక్క. అక్క, బావగారు దూరంగా వేరొక ఇంట్లో ఉండేవారు. వారి ముగ్గురు బిడ్డలు అమ్మమ్మ బాధ్యతలో మాతోనే ఉండేవారు. అక్క, బావ వారి ప్రక్కింటి వారి ద్వారా క్రీస్తును రక్షకుడిగా నమ్మారు. మంచి సహవాసంలోనే ఉన్నారు. మా అక్క తన విశ్వాసాన్ని మాతో పంచుకొనేది మా పిన్ని, మా అమ్మ, మా బంధువులు కూడా క్రీస్తును గూర్చి చెప్పడం వల్ల మాకు వినుట వలన విశ్వాసం కల్గింది.

వారంతా చెప్పే సత్యం ఒక్కటే యేసు క్రీస్తే సజీవుడు, నిజదేవుడు, విగ్రహాలు నమ్మటం దండగ. ఎన్నో మేలులు చేసేది క్రీస్తే. శాంతినిస్తారు. శాంతి పావురాలు ఎగరేసే పెద్దలంతా కల్లోలాలు కల్గిస్తారు కాని నిజమైన శాంతి యిచ్చే శాంతిదూత క్రీస్తు. యోహాను 14:27. పాపము వల్ల దేవుని నుండి దూరమైన వ్యక్తి క్షమాపణ కోరి రక్షణ పొంది క్రీస్తును నమ్మితేనే నిజమైన శాంతి. సముద్ర హోరులో ప్రక్కగానున్న కొండమీద దాగిన పక్షి పాడే పాట నిజమైన శాంతి. పాపం చేసిన సమరయ స్త్రీని ఒంటరిగా దర్శించి పాపాలు క్షమించి జీవజలాలనిచ్చి ఆమె జీవితానికి శాంతినిచ్చారు. క్రీస్తు దగ్గరకు ఎవరైతే నడిపిస్తారో వాళ్ళంతా శాంతి దూతలే. యేసే రక్షకుడు పరలోకం మనదేశం యేసును నమ్మి సేవించాలి అని చెప్పడం సువార్త.

ఈ మాటల సారమంతా మా కందరికీ కనువిప్పు కల్గించి, హృదయాల్లో పని చేసింది. అప్పటికే నిరాశ, చింత అశాంతి, ఆర్థిక లేమితో ఉన్న మాకందరికీ ఈ దేవుడిని నమ్మి చూద్దాం అనిపించింది. రక్షణ పొందుటకేమి చేయాలి? అనేవి తెలిసికొని ప్రార్థించడం, బైబిలు చదవడం అవసరము అని తెలిసికొని మా దగ్గరవారు వెళ్తున్న సంఘానికి వెళ్ళడం ప్రారంభించాము. రెండు క్రొత్త నిబంధ నలతో అన్ని విషయాల్లో ఆత్మీయంగా జ్ఞానాన్ని పొందాము. క్రీస్తును స్వీయ రక్షకునిగా అంగీకరించాము. అందరిలో గొప్ప సంతోషం నెమ్మది. మా అందరి పరిస్థితులలో గుర్తించగల మార్పు గమనించాము.

నన్ను ప్రభువు మార్చుకున్న వెంటనే ప్రార్థనా గదిలో ఎడతెగక ఉపవాసాలు, ప్రార్థన, వాక్యంలో లీనమయ్యాక ఒక్క సంవత్సరంలో పరిశుద్ధాత్మ నన్ను బలంగా తాకింది. అన్యభాషల వరం, వివేచన వరం, ప్రార్థనా వరం సమృద్ధిగా నన్ను ఆవరించి ఆవిరిగా నా చెవులలను తాకిన అనుభవం వచ్చింది, దేవునికి స్తోత్రం. ఈ అనుభవాలన్నీ నాకు క్రొత్త.

నా రక్షణ భాగ్యాన్ని, క్రీస్తుతో నాకు గల బంధం ప్రేమను బట్టి ఇతరుల అవసరాలకోసం భారంతో ప్రార్థించే భారం నాలో పెట్టారు. నేనెవరిని పిలువలేదు. నాలో క్రీస్తు పని చేస్తున్న ఉనికి గ్రహించి కొందరు అపరిచితులు నా దగ్గరకు వచ్చి ప్రార్థనా గదిలో ప్రార్థించుకొనేవారు.

నాకు జ్ఞానం తక్కువ, పెద్దగా చదువుకోలేదు. 3వ తరగతి వరకే విద్య. బైబిలు, బైబిలు పుస్తకాలు చదువలగను సంతకం చేయగలను. చాలా నిదానంగా పట్టి పట్టి ఒక్క

లైను వ్రాయడానికి ప్రయాసపడతాను. యిట్టి నన్ను ప్రభువు పాదసేవ చేసే అమృతమైన ఆయన నామాన్ని ఘనపర్చుకొనే ధన్యత యిచ్చారు, హల్లెలూయా.

ఎందరో ప్రార్థన సహవాసం కోరి ఆ చిన్న ప్రార్థనా గదిలో బేతనీవలె సేదతీరి ఆనందంతో వెళ్లారు. ప్రభు కృప, పరిశుద్ధాత్ముని నడిపింపు ఏకాంత ప్రార్థన సహవాసమని రూఢిగా చెప్పగలను.

నా భర్త బోయజుగారు చెప్పిన మాట "దేవుడు గొప్ప కృపగలవాడు మేము అన్యులుగా ఉన్నప్పుడు ఏకార్యాలు జరుగలేదు. మనస్సుకు నిజమైన శాంతిలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా జరుగుబాటులేదు. క్రీస్తులో శాంతి, సంతోషం ఉన్నాయి. దేవుని సంపూర్ణ చిత్తానికి లోబడితేనే జయజీవితం స్వంత ప్రయాత్నాలన్నీ వ్యర్థమగును. కొన్ని దెబ్బలు, నష్టాలు పొందడం ద్వారా మరలా క్రీస్తును ఎక్కువ సేవిస్తేనే మేళ్ళు పొందగలమని తెలిసింది". అవిధేయత వల్ల కార్యాలు జరగవు అని అన్నారు. ప్రార్థనకు వచ్చే వ్యక్తులలో ఒకామె భర్త ఆమెను వదలిపెట్టి దూరంగా వెళ్ళిపోయారు. అప్పటికామె గర్భవతి. ఎంతో దుఃఖంతో నా దగ్గర ప్రార్థనకై వచ్చింది. ఆమెను ఆదరించి ప్రార్థించగా ప్రభువు దర్శనంలో మగపిల్లవాడు కల్గును. అతను తిరిగి తప్పక వచ్చి ఆమెను చేర్చుకొనునని తెలియపరిచారు. మరొక కుటుంబంలో బిడ్డల వివాహము ఒక పాప అమెరికా ప్రయాణం యివన్నీ దర్శనంలో చూడడం జరిగింది.

మా అక్కకూతురు మున్ని బాప్తిస్మం తర్వాత దెబోరా, విశ్వాసియైన భర్తను ఉపవాసంలో దర్శనం ద్వారా పొంది ఒక పాపకు తల్లిగా దేవుని స్తుతిస్తుంది.

మా అక్కయ్యగారబ్బాయి సూరిబాబు జాన్‌ఫిన్నీగా బాప్తిస్మం తర్వాత పేరుమార్చుకొని మంచి విశ్వాస జీవితం జీవిస్తున్న సమయంలో శోధన ఎదుర్కొన్నాడు. కాని నేడు విజేతగా సాక్షిగా మారాడు.

ఫిన్నీకి వివాహంలో శోధన గలిబిలి అలజడి అని ప్రభువు నాకు తెలియపర్చారు. సాధారణంగా పెండ్లి సమయంలో వచ్చే గొడవలని సర్దుకున్నాము. కాని 24 గంటలు గడిచే సరికి ఆ పెండ్లి భార్య ఫిన్నిని నిరాకరించి భర్తగాలేదని తృణీకరించి నాకు అతనితో సుఖం లేదని సాతాను ప్రేరణతో క్రీస్తుకు వ్యతిరేకంగా మారిన ఇస్కరియోతు యూదా వలె ప్రవర్తించి, అందరి పరువు మంటకల్పింది. మంచి విశ్వాసులు, క్రీస్తును నమ్మినవారే. దుఃఖంతో ప్రభువు పాదాలు ఆశ్రయించాము. తర్వాత సంవత్సరంలో వివాహం జరిగింది. మంచి విశ్వాసి దొరికింది. ఆమెకు గర్భఫలం దయచేసి ఫిన్నీ నిందను తొలగించి ఎవరైతే అవమా నించారో వారే సిగ్గుపడునట్లు ప్రభువు గొప్ప కార్యం చేసారు. మేమంతా ప్రభును మహిమపర్చాము. సాతాను వెన్నంటి మరొక గలిబిలి సృష్టించి కలవరం కల్గించాడు. బాబు కడుపులో ఉండగా 8వ నెలలో ఆ తల్లికి స్కానింగు ద్వారా మూత్రపిండాల లోపం అని కనుగొన్నారు. బాబు బ్రతకడం కష్టం. ఆపరేషన్ చేయాలి ప్రమాదం నివారించాలి అని డాక్టర్లు అన్నారు. వెంటనే మా ప్రార్థనాగదిలో మోకరిల్లి మొర్రపెట్టాము. ఉపవాస ప్రార్థనలు చేసాము. ఒక్క వారంలో మరలా స్కానింగులో చూచి బాబులోపం నివారణ జరిగిందని చెప్పారు. అద్భుతమైన కృపకై స్తుతించాము. కాలం పరిపూర్ణమైనప్పుడు ఫిన్నీ భార్య సుఖప్రసూతి ద్వారా బాబును కన్న ది. ఇది రెండవ అద్భుతము. రెండవ వివాహం వెంటనే బిడ్డను పొందిన ఆనందంలో ఫిన్నీ విశ్వాసం మరింతగా బలపడింది. అందరమూ ప్రభువును ఘనపరచాము. సేవకై కొనసాగాము. గలతీ 6:9, అలయక మేలు చేసితిమేని తగిన కాలమందు పంట కోస్తాము.

నా పని ప్రార్థన, విజ్ఞాపన. అదే నమ్మకంగా చేయ సాగాను. 1 సమూయేలు 16:7, మనుష్యులుపై రూపాన్ని లక్ష్యపెట్టగలరు. యెహోవా హృదయాన్ని లక్ష్యపెట్టును. చదువులేని నన్ను మాటలాడుటచేతకాని, పేదరాలినైన నన్ను ఆయన ప్రేమలో నిలబెట్టి ఎందరో అపరిచితులైన గొప్ప విశ్వాసుల మధ్య దేవుని సేవ కొనసాగించే కృప నిచ్చారు. దేవునికే స్తుతిస్తోత్రము, హల్లెలూయా.

మేమంత లోకజ్ఞానం కలిగినవారము కాము. అమాయ కులమనే చెప్పాలి. ప్రభువును నమ్మకంగా ప్రేమిస్తు, ఒకే

విశ్వాసంలో సాగిపోతూ భక్తులను ఆదరిస్తూ ఉండేవారం. ఒక పాస్టరుగారు నా భర్త బోయజుగారి కోరిక మేరకు మా దీనస్థితి చూచి అరేబియాలో పనులు న్నాయని వీసా తెప్పించి పంపుతానని ఆశపెట్టాడు. ఉన్నదంతా మా అమ్మ యిచ్చింది. కొంత అప్పుగా తెచ్చుకొని ముందు బొంబాయి పంపాము. అక్కడ ఇదిగో అదిగోనని చెప్పి కాలయాపన చేశారు. పరువుకోసం మౌనంగా భరించాము. బొంబాయిలో స్థానిక విశ్వాసులు ఆదరించి పని ఇప్పించారు. ఎంతో నిరీక్షణతో కనిపెట్టాము. గల్ఫ్ తీసికొని వెళ్ళి పనులు లేవని చెప్పి తిరిగి బొంబాయి పంపించివేశారు. ఎంతో సొమ్ము నష్టం. బాధతో అవమానంతో అక్కడే ఉండి ఉద్యోగం చేసి కొంత సొమ్ముతో కొన్ని సంవత్సరాల తర్వాత ఇల్లు చేరారు. మా ఆయన బొంబాయిలో ఉన్న సమయంలో అమ్మ ముందు నా భర్తతో మాటాలాడుటకు ముఖం చెల్లక, చాటుగా నా భర్తకు ఫోన్ చేసేదానను. పరిస్థితి చాలా అద్వాన్నంగా ఉండినప్పటికి నా భర్తను ధైర్యపర్చి ప్రార్థించేదానను. ఆ సమయంలో ఎక్కువ సమయం సువార్తకు కేటాయించే దానను. ఆ తరువాత నేను చేయగలిగంది ఆ ప్రభువు పాదాలు ఆశ్రయిం చటమే. అదే చేసేదానను.

అయితే దేవుడు అద్భుతరీతిగా నా భర్త అధ్యాత్మిక స్థితిని ఈ పరిస్థితి ద్వారా బలపరచారు. బాధలు భరించి నష్టం పొందిన నా భర్త పరీక్షించిన తర్వాత సువర్ణంవలె మంచి భక్తిలో నిలిచారు. నేడు నా బిడ్డలతో కలిసి బైబిలు వాక్యాలు క్రీస్తు ఫోటోలు లేమినేషన్ చేసి షాపులలో అమ్ముట అనే వ్యాపారం చేస్తూ కుటుంబమును పోషిస్తున్నారు.

క్రీస్తుకు దూరంగా దుర్వ్యసనాలపాలైన పెద్దబాబు నేడు బైబిలు, బైబిలు పుస్తకాలు అమ్ముతూ భక్తులకు దైవసేవకులకు సహకరించే విధంగా ప్రభువు మార్చారు. యెహోషువవలె నేను, మా యింటి వారందరూ యెహోవానే సేవిస్తున్నాము. ఈ క్రీస్తు ప్రభువు నిజరక్షకుడు. అన్య దేవతలన్నీ వట్టివే మట్టివే. ఆత్మ స్వరూపియైన దేవుడు అందరినీ ఆదరించి పోషించి దీవించగలరు, హల్లెలూయా!

## చందాదారుల వివరములు

రెవ.డా|| వి. విజయకుమార్, బొబ్బిలి - 5000/-
మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
రావెల ప్రసాదరావు, గుంతకల్లు (21-06-24) - 5000/-
వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-
అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
డా|| సిహెచ్‌కె. సుష్మ ప్రశాంత్, నెల్లూరు - 1500/-
జయ, గుంటూరు (6-3-24)- 1500/-
గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000
జి.మాణిక్యమ్మ అనంతపురం (25-3-24) 1000/-
కె. రజిని, నరసరావుపేట - 1000/-
వి. కస్తూరి, భీమవరం 500/-
శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
పి.వి.రెడ్డి, ఒంగోలు - 500/-
బి. నెహెమ్యా, చిన్నగంజాం - 500/-
నైటింగేల్, నెల్లూరు - 500/-
మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ - 500/-
డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల - 500/-
ఆర్. దేవికుమారి, పర్చూరు (20-5-24) 500/-
వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
జి. కళావతి, ఒంగోలు 350/-
కె. కల్పన, గోవా - 350/-
జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
సి.హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట (18-3-24) 350/-
కె. రాజేష్, రాజమండ్రి - 350/-
యస్. గోపి, పార్వతిపురం - 350/-
శ్రీమతి. సరోజిని -350/-
పి. దేవదానం, గుంటూరు - 300/-
పి. యేసుబాబు లోకేష్, చింతలపూడి - 200/-
ఆర్. ఇన్నయ్య, గుంతకల్ - 200/-
టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు - 350/-
జి. జార్జిథామస్, దుగ్గిరాల - 500/-
టి.యం. భగవాన్‌దాస్, కదిరి (7-3-24) - 350/-
కె. విజయకుమార్, ఒంగోలు (1-3-24) 350/-
జె. రాజేష్, ఒంగోలు (6-7-24) 350/-

**బైబిల్ క్విజ్-07 జవాబులు పంపినవారు :**

1. ఆనీమేరి, హైదరాబాద్, 2. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 3. స్వప్నిక-మార్కాపురం, 4. లలిత-రాజమండ్రి, 5. సబిత-కాకినాడ, 6. వి.రత్నమ్మ-హైదరాబాద్, 7. రాధ-నెల్లూరు, 8. స్టీఫెన్-వరంగల్, 9.కుమారి-తెనాలి, 10. వెంకట్రావు -హైదరాబాద్, 11. ప్రియ-తాడిపత్రి, 12. రాజేష్-కడప. 13. ప్రియాంక-విజయవాడ.

# నీ సృష్టికర్త

సాధారణంగా ప్రతి మనిషి తమ అందాన్ని లేదా రూపాన్ని చూచి మురిసిపోతూ, దానికి మరికొన్ని హంగులు అద్దుతూ, మెరుగులు దిద్దుతూ, తమను తాము చూసుకొని మురిసి పోతుంటారు.

నేటికాలంలో శరీర ఆకృతి (బాడీ ఫిట్‌నెస్)పై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. కొందరు అందం కొరకుకాగా, కొందరు ఆరోగ్యం కొరకు ఇలా రకరకాల కారణాలతో శరీర ఆకృతిని మార్చడానికి తమకు అనగుణంగా శరీరం మలుచుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవానికి అందరి నిజదేహరూపం, అదే అందరి (ఆడ మగ) అస్థిపంజరాలు ఎటువంటి అందము, ఆర్భాటాలు లేకుండా ఒకేలా ఉంటాయి.

అయితే మానవ శరీర నిర్మాణానికి మరియు రూపానికి ముఖ్యమైనది ఆధారమైనది అస్థిపంజర వ్యవస్థ. చర్మము, మాంసము లేని మానవ శరీరం ఎముకలగూడు. అదొక ప్రత్యకమైన విధులు కలిగి శరీర ఉనికికి మూలస్థంభం వలె పనిచేస్తుంది.

మానవ దేహానికి కావలసిన రక్తము తయారయ్యేది ఎముకలలోని మధ్య భాగమునుండే దానినే మజ్జా లేదా బోన్‌మ్యారో అంటారు.

మనిషి జీవించి ఉండుటకు అవసరమైన ఆక్సిజన్‌ను శరీరంలోని అన్ని కణజాలాలకు చేరవేసే ఎర్రరక్త కణాలు ఎముక మజ్జలోనే తయారౌతాయి.

శరీరంలో వ్యాధికారక క్రిములతో పోరాడి శరీరమును ఆరోగ్యముగా ఉంచే తెల్లరక్తకణాలు ఎముకమజ్జలోనే తుయారౌతాయి.

గాయం తగిలినప్పుడు రక్తం గడ్డకట్టుటకు ఉపయోగపడే ప్లేట్‌లెట్స్ కూడ ఎముకలోనే తయారౌతాయి.

మానవుని ఎముకలు చాలా ధృడంగా ఉంటాయి. చెప్పాలంటే అదే పరిమాణంలో ఉన్న స్టీల్ రాడ్‌తో పోల్చినట్లయితే స్టీల్ రాడ్ కంటే ఐదు రెట్లు ఎక్కువ ధృడంగా ఉంటాయి. అంతేకాదు స్టీల్‌రాడ్‌తో పోలిస్తే ఎంతో తేలికగా ఉంటాయి.

మన అరచేతి సైజ్ ఉండే ఎముక దాదాపు 9000కేజీల బరువును మోయగలదట.

ఎముకలు మన శరీరంలోని అతి ముఖ్యమై భాగాలను పరిరక్షించడం కొరకు నిర్మించబడినవి అని చెప్పవచ్చు. మెదడును రక్షించుటకు కపాలం, ఊపిరితిత్తులు, గుండె కొరకు ప్రక్కటెముకలు నిర్మించబడినవి.

పుట్టిన శిశువులో 300 ఎముకలు ఉంటాయి. పెరిగే కొద్ది కొన్ని ఎముకలు ఒకదానితో ఒకటి అతకబడి ఎదిగిన వ్యక్తిలో 206 ఎముకలు ఉంటాయి.

ఎముకలు కాల్షియం పాస్ఫేట్ మరియు కాల్షియం కార్బోనేట్ అనే పదార్థాలతో తయారుచేయబడినది. శరీరంలో కాల్షియం తక్కువైతే ఆ కొరతను సరిచేయుటకు ఎముకలలోని కాల్షియంను శరీరం తీసుకుంటుంది.

శరీరం మొత్తం 206 ఎముకలు ఉంటే కాళ్ళలో 54, చేతిలో 52 ఎముకలు ఉంటాయి. అంటే 50% కంటే ఎక్కువ ఎముకలు మన కాళ్ళు చేతులలోనే ఉంటాయి.

అతి చిన్న ఎముక చెవిలోను, అతిపెద్ద ఎముక తొడలో ఉండే తుంటి ఎముక.

వెన్నుముక ఆకారంలో పెద్దదైనప్పటికి అది ఒక ఎముక కాక 33 ఎముకల సముదాయంగా ఉన్నది.

ఆకారంలో ఎంతో పెద్ద మెడ కలిగిన జిరాఫీ మెడ 7 ఎముకలు ఉండగా, మనిషి మెడలోను 7 ఎముకలు ఉంటాయి.

దేవుడు మానవుని గురించి ఎంత ప్రత్యేకమైన శ్రద్ధను కలిగి ఉన్నాడో తెలుసుకొనుటకు మన శరీరమను గురించి లోతుగా తెలుసుకుంటే, హృదయం కృతజ్ఞతతో నిండిపోతుంది.

ఆధునిక దృక్పథం

క్రొత్త కోణాలు

## 7. నీతికోసం తృష్ణ - ధన్యతైన తృప్తి

**"నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు" - మత్త.5:6**

Blessed are they which do hunger and thirst after righteousness; for they shall be filled ` KJV.

**లోకంలో అనేక సందర్భాల్లో నీతి లేని వారే నీతిని గురించి మాటలాడేది; అధికార ధనదాహంతో తృప్తి లేనివారే తృప్తిని గురించి తబలా వాయిస్తుంటారు. నీతిని వెదకటం ఒక ధన్యత కావాలంటే ఆ నీతి ఏమైయుండాలి దానిని ఏ మేరకు వెదకాలి అనే దాన్ని క్రొత్తకోణాల్లో చూద్దాం.**

ఈ వ్యాసం క్రొత్తకోణాల శ్రేణిలో ఏడోది, ధన్యతల వరుసలో నాలుగోది. ఈ ధన్యతలోని నీతి, ఆకలిదప్పులు అనేవి ఈనాటి వాడుకలో ఎలాంటి అర్థాలు సంతరించు కొనింది, క్రీస్తు సూక్తులుగా చెప్పిన ధన్యతల సందర్భంలో కొంత అర్థమౌతాయి. కనుక మొదట ఈ విషయాన్ని పరిశీద్దాం.

**నీతి (Righteousness)**: ఈ మాట డైకాయియోసూమె (dikaiosume) కు సమమై న్యాయము (Justice) లేక నీతి మత్వము (Righteousness) నుండి వచ్చింది. ఈ నీతి దేవుడు కోరే న్యాయాన్ని నెరవేర్చేది. అది దేవుని తీర్పునకు సంబం ధించిన పరీక్షలో నెగ్గేది (2కొరిం.3:9, 6:4 ఎఫె.4:24). దేవుని బోలు నీతి (మత్త.6:33, యాకో.1:20). దేవుని నీతి మానవుని మీద ఆయనకుగల హక్కు. ఇది మానవుడు గుర్తెరిగి దేవుని హక్కుకు పూర్తిగా విధేయుడు కావాలంటే, దేవుడు తనను తానెట్లు మానవునకు దత్తం చేసుకొంటాడో అదే విధంగా దేవునిని స్వీకరించాలి (రోమీ .5:17). ఈ దైవ హక్కును విశ్వాసము ద్వారా గుర్తెరిగినపుడది ధర్మశాస్త్ర సంబంధమైన నీతికి వ్యతిరేకమౌతుంది (రోమీ.10:5, గల. 3:21). మానవుడు పాపము ద్వారా పతనమైన కారణంగా సహజంగా తనకు తానుగా ఏర్పరచుకొనిన, సృష్టించుకొన్న నీతి ప్రమాణాలను స్వీకరిస్తుంటాడు (రోమా. 10:3; ఫిలి. 3:6). అయితే, అట్టివి నీతి కాదు (రోమా. 10:5,13; గల. 3:21), అట్టిది దేవునికి ఆమోదకరము కాదు. దేవుని నీతి మానవునికి దేవుని ఉచిత కృపావరముగా ఆపాదింపబడింది. అది మానవుడు సంపాదించుకొనునది కాదు.

**ఆకలిదప్పులు (Hungur & thirst):** మాటలు శూన్యంలో అర్థరహితాలు. ఒకరి అనుభవంలోనే అవి సార్థకాలవుతాయి. అందువల్ల నేటి అధునాతన జీవితశైలిలో ఆకలిగొనటం, దప్పిగొనటమనేది ఏమంత గొప్ప విషయంగా ఎంచం. సాయంవేళలో ఆకలివేస్తే ప్రేవులు కదిలితే, కనీసం ఒక బిస్కట్టు కొరుకుతాం. దప్పికవేస్తే ఫ్రిడ్జ్ నుండి తీసి ఒక కోక్‌ను సిప్ చేస్తాం. లేకుంటే నిత్యం అందుబాటులో ఉండే పంపు త్రిప్పి నీరు పట్టుకుంటాం. అయితే, యేసు పాలస్తీనాలో, ఎడారి ప్రాంతాలున్న పాలస్తీనాలో సంచరిస్తూ ఈ ధన్యతల్ని ప్రతి పాదించిన కాలంలో ఒక కూలినాలి చేసుకొని బ్రతికే వాని దినకూలి రెండు మూడు పైసలు (ఒక స్త్రీ రెండు కాసుల కానుక వేసిన సంఘటన గుర్తుంచు కోవాలి). ఇప్పటికీ, అప్పటికీ డబ్బు విలువలో, కూలీలో తారతమ్యం వుంది. అయినా, ఆ రోజుల్లో వారి సంపాదనతో శుష్టిగా భోజనం చేయటం కష్ట తరం. వారానికోసారి కూడ మాంసం తినలేరు. అలాంటి వారు ఆకలికి పస్తులకు అతి సమీపంలో ఉంటూ, ఆకలంటే ఏమిటో గ్రహించగలరు.

దప్పిక విషయంలో పాలస్తీనా వారి అనుభవం మరీ దారుణంగా ఉంటుంది. ఒక మనిషి పోతూ ఉంటే హఠాత్తుగా ఇసుక తుఫాను రేగుతుంది. తన తలపాగా చివర గుడ్డను నోటికి ముక్కుకు అడ్డం చుట్టుకొని గాలివాటుకు వీపు త్రిప్పి నిలబడటంకన్న చేయగలిగింది ఏమి లేదు. ఎంత గుడ్డ రేణు వులు ముక్కులో, అడ్డమున్నా సూక్ష్మ ఇసుక అంగిట్లో, గొంతులో పొరకడుతుంది. పిడచకట్టిన గొంతు, నాలుకలతో ప్రాణం పోతుందనే దశలో చిటికెడు నీరు దప్పిక తీరుస్తుందనే 'సందర్భంలో గాని దప్పికంటే ఏమిటో అర్థంకాదు.

కనుక, ఈ నాలుగో ధన్యతలోని ఆకలి ఏదో సుతిమెత్తని ఆకలి కాదు; రోజులు తరబడి పస్తుల్తో ప్రేవులు పీక్కుపోయే ఆకలి, గ్రుక్కెడు నీరు త్రాగితేగాని ప్రాణాలు మింట కలుస్తా యనే దప్పిక. అందుకని, ఈ ధన్యత ఒక ప్రశ్న, ఒక సవాలు విసరుతుంది. అది, లోగడ చెప్పబడిన దేవుని నీతిని (మంచి

తనాన్ని) ఏ స్థాయిలో వాంఛిస్తున్నావ్? ఆ మలమల పస్తులతో మాడేవాడు ఆకలితో కమికెడన్నం కోసం కోరేంతగా, లేక నాలుక పిడచకట్టుక పోయినవాడు నీటికోసం చూచినంత తీక్షణంగానా?

మానవమాత్రులకు సహజంగా (instinctively)నే నీతి కోసం తపన ఉంటుంది. యౌవనకాలంలో ఆదర్శవాదం ఎక్కువగా ఉండే రోజుల్లో నీతికోసం ప్రాణాలనైనా ఇయ్యాలనే వారుంటారు. రాను రాను ఎక్కువమందిలో నీతిగా ఉండాలనే వాంఛ మన ఊహల్లో దోబూచులాడే కమ్మని దృశ్యంగా ఉంటుందేగాని నిశితంగా, తీవ్రంగా మాత్రం ఉండేదికాదు. ఒక పరీక్ష సమయం వస్తే ప్రయాస పడాలనిగాని, త్యాగం చేయటానికి గాని జారిపోతాం. ఈ సంక్షోభాన్నే రాబర్ట్ లూయిస్ స్టీవెన్సన్ 'కావాలి అనుకోకుండా చేసే రోగం' (The malady of not wanting) అని అన్నాడు. అంటే, మంచిదనుకొన్న దాన్ని గట్టిగా కోరి వెంటాడాలి. ఆకలిదప్పులతో వెంటాడాలి. నీతినే ప్రధానంగా మనం కోరుకొంటూ ఉంటే ఈ లోకంలో ఎంతో ఎంచదగ్గ మార్పు వచ్చేది!

ఈ దృక్కోణంలో మనం ఈ ధన్యతను చూచినప్పుడు నీతిని మనలోనుండి మనం పొందాలనే వాంఛ బహు తీవ్రత రంగా ఉంటుంది. ఒకవిధంగా, బహు భయంకొలిపేదిగా కూడ ఉంటుంది. మరోవిధంగా బహు ఆదరణకరంగా కూడ ఉంటుంది.

**2**: ఈ ధన్యతలోని మాటలను మనం జాగ్రత్తగా పరిశీలిస్తే నీతిని సాధించిన మనిషి విషయంకాదు గాని కేవలం దానిని సాధించాలనే ప్రగాఢ చింత కలిగితేనే సరిపోతుందనిపిస్తుంది. ఆకలిదప్పులు కలిగి ఉండటమంటే, ఆ నీతిని సంపాదించాడని కాదు. సాధించాలనే పెనుగులాట. ఓడిపోతున్నా గెలవాలనే తాపత్రయముంటే సరి. ఆ ధ్యేయాన్ని పట్టు వదలకుండా పిడికిటిని పట్టుకొని యుండుటయని.

హెచ్.జి.వెల్స్ అనే ఆంగ్ల శాస్త్రీయ సంబంధ రచయిత, "ఒకడు పనికిమాలిన సంగీతకుడు కావచ్చును; కాని అతనికి సంగీతమంటే చెవికోసుకొనేంత ప్రేమ ఉండొచ్చు" అని అన్నాడు. అదే కోవలో రాబర్టుాయిస్ స్టీవెన్సన్ బహు అధ్వాన్నపు లోతులకు దిగజారిన వాడి విషయం ప్రస్తావిస్తూ, "సానె కొంపల్లో, ఉరికంబాన్నెక్కుతూ, తమలో మిగిలిపోయిన చిన్నమంత మంచితనాన్ని భద్రంగా పిడికిల్లో పట్టుకొంటూ" అని రాశాడు. సరానార్మన్ బర్కెట్ అనే ప్రసిద్ధ న్యాయవాది, తరువాత న్యాయమూర్తి, తనపనిలో తటస్థపడ్డ నేరస్థులను గురించి మాటలాడుతూ, ప్రతిమానవునిలో ఆర్పివేయలేని మంచితనాన్ని గురించి ప్రస్తావిస్తూ "తృప్తి తీరని వేటగాడు' తమ మడిమలబట్టి వెంటాడుతుంటాడు. మనుష్యుల్లో అత్యంత అధములు కూడ ఏదో ఒక దొడ్డతనానికే శిక్షింపబడతార"ని తాత్వికంగా అన్నాడు.

ఒక మనిషిలో ఉండే మహాత్మ్యమేమంటే, అతడు పాపాత్ముడే కాని తన పాపంలో కూడ మంచితనం చేత వేధింప బడుతుంటాడు. బురదలో ఉండి కూడ ఆకాశ నక్షత్రాలను మరువలేని వాడు. దావీదు, తన జీవిత పర్యంతం యెరూష లేము గుడిని కట్టాలని తపించాడు. ఆ అత్యాశనాతడు సాధించ లేకపోయాడు. అసలది అతనికి కాకుండా చేయబడింది. అయితే, 'నా నామ ఘనతకు ఒక మందిరము కట్టించుటకు నీవు తాత్పర్యము కలిగియున్నావు, ఆ తాత్పర్యము మంచిదే' అని యెహోవా సెలవిచ్చి యున్నాడు (1రాజు. 8:18). దేవుడు తన కృపాబాహుళ్య తనుబట్టి మనల్ని తీర్పు తీరుస్తాడు. మనం సాధించి నెరవేర్చిన వానిని బట్టియేకాదు; మనం మనస్సుల్లో ఉద్దేశించి కనే కలలనుబట్టి కూడ ఒక మానవుడు ఒక మంచి నేనాటికీ సాధించ లేకపాయినా తన అవసాన కాలమందు దానికోసం ఆకలి దప్పులు కలిగియుంటే అతడు ధన్యుడు.

**3**: ఈ ధన్యతలో మరియొక విశేషం కూడ ఉంది. ఇది కూడ గ్రీకు మూలంలోని మాటలను పరిశీలిస్తే అర్ధమౌతుంది. గ్రీకు వ్యాకరణంలో ఆకలికొను (hungering), దప్పిగొను (thinst ing) అనే present-participle క్రియల తరువాత షష్ఠీ విభక్తి (Genitive case) వస్తుంది. అంటే 'ఆ 'అని ఇంగ్లీషులో, 'యొక్క' అని తెలుగులో అనే పదాలు కలిసేవి. అంటే, hungering కు hungering of the man (మనిషియొక్క ఆకలిగొనుచుండుట). అంతేకాదు, ఒక కర్మార్ధకమైందిగా కూడ ఉంటుంది. అంటే, ఆ క్రియలోని అర్థంలోని మాటయే దానికి 'కర్మ' అవుతుంది. ఆకలిగొనుచుండుట దేనికి? ఆహారం కొరకు. అంటే ఆహారం కోసం ఆకలిగొనటం అదైనా ఒక భాగమే. అంటే నిండు భోజనం కొరకు కూడ కాదు. పట్టెడన్న మైతే చాలు. అంటే ఆ అక్కర (ఆకలి, దప్పిక) తాత్కాలికంగా తీరే అంత. అంటే నీతికోసం అన్నప్పుడు ఏ కొంచెం నీతి కోసమైనా ఆకలి దప్పులుంటే... అని. అనరాదు. ఇక్కడ నీతి

సంపూర్ణమైయింది. అసంపూర్ణమైంది ఆకలిదప్పులు. కనుక, "నీతి అంతటి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు" అనే భావం స్ఫురిస్తుంది.

అయితే, ఈ పరిపూర్ణతను ఏ కొందరో ఆశిస్తారు. అలాంటి వారు నీతిలోని ఏదో ఒక భాగంతోనే తృప్తి పడుతారు. ఒక మనిషిని ఇతరులు శల్యపరీక్ష చేస్తారు. అతనిలో ఏ కొంచెం అవకతవక లేకుంటేనే తనను మంచివాడని అంటారు. అతని యధార్థత, నైతిక సహజత్వం, గౌరవ మర్యాదలు ప్రశ్నించుటకు వీలు లేనట్లుండాలి.

అటువంటి శుద్ధుని (మంచివాని) యొద్దకు ఎవరైనాపోయి తన బాధనాతని రొమ్ముమీద వదలి శిరమునానించి ఊరట పొందగలడో లేడో! అలా ఎవరైనా ప్రయత్నిస్తే ఆ మంచి మనిషి ముడుచుకపోవచ్చు. అంటే, మానవుల దృష్టిలో మంచివానిగా యుండవచ్చు. సానుభూతి శూన్యమైన వాడు కావచ్చు. అలాంటి నైతికస్వభావాలున్నవారు నిజానికి హృదయ కాఠిన్యత కలిగిన వారై మంచితనం అసంపూర్ణమైంది.

మరోదిశలో ఒకమనిషిలో బాహ్యమైన ఎన్నో అవకతవక లుండొచ్చు. అతడు త్రాగవచ్చు, బూతులాడవచ్చు. జూదరియై యుండవచ్చు, ముక్కుమీదనే కోపముండవచ్చు. అయినా, పైసా వరకు లోడి యివ్వవచ్చు. తనపై కోటు తీసి అక్కరలో నున్న ఎవరైనా కష్టాల్లో అతన్ని సమీపిస్తే అతని జేబులో ఉండే చివరి వానికియ్యవచ్చు. అలాంటిదీ మంచితనంగా కనుపిస్తుంది కాని అసంపూర్ణమే. అందుకని, నీతి అనేది మానవ అంచనాలతో సరిపెట్టుకొనేది కాదు. మనం ఆకలి దప్పులు కలిగి ఉండాల్సింది దేవుని నీతి విషయం. ఏ తప్పు లేని మంచుగడ్డగా గాని, తప్పులన్నీ ఉండే వెచ్చదనంగా గాని ఉంటే చాలదు.

దేవుని నీతికోసం ఆకలిదప్పులుంటే ఆ నీతిని దేవుడు వారికి సమకూర్చి తృప్తిపరచును అని ఈ ధన్యత భావం.వారిని ఈ తృప్తి పరచేది శారీరక ఆకలిదప్పులు తీర్చటమని కాదు. నీతి విషయంలో కలిగిన ఆరాటాన్ని తీర్చి ఆత్మీయ తృప్తిని కలిగించటమని!

వచ్చే మాసం:
**కనికరం చూపటం - పొందటం**


## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యధార్ధ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ.150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లొపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# కృపాదానం

కనిగిరి నుండి 1987 మే నెల1వ తారీఖన కుటుంబ మంతటితో ఒంగోలు వచ్చాను. కొండమీదకు చేరి అక్కడ పండుకున్నాము. మా అత్తకు మేమంటే అంత గౌరవము లేదు. ఎందుకంటే నా దగ్గర ఆమెకు ఇవ్వగలిగినంత డబ్బులు లేవు.

తెల్లవారితే మే 2వ తారీకు. మా నాయన పుట్టినరోజు. నా పెద్ద చెల్లెలు రాణెమ్మ పుట్టినరోజు కూడా ఆ రోజే. ఆమె రేపల్లెలోని పాస్టరు మానికొండ ప్రసాద్‌రావుగారి భార్య.

కొండ మీద నుండి ఉదయం 4 గంటలకు స్టేషన్‌కి చాలా దగ్గరలో ఉన్న మా ఇంటికి వచ్చాను. చర్చి, హాస్టల్, స్కూలు అన్నీ ఒకేవీధిలో ఉన్నాయి. అసలు అక్కడ ఒక వీధి అనేది లేదు. దానిని మంగలోడి తోపు అనేవాళ్ళు. మా నాయన అక్కడ రెండు స్థలాలు కొని క్లాపేట అయిదవ లైను తర్వాత ఉన్నది కాబట్టి క్లాపేట ఆరవ లైను అన్నారు.

అనాథ శరణాలయము, స్కూలు అన్నీ ఆ వీధిలో కృపాదానముగారే స్థాపించి నడిపిస్తున్నారు. కాబట్టి కృపాదానము చర్చి అని, కృపాదానము హాస్టల్ అని పిలువ నారంభించారు. కృపాదానంగారు ఆ వీధిలో ఈ కార్యము లన్నీ ప్రారంభించినప్పుడు ఈ లోకంలో జన్మించనివారు ఇప్పుడు ఈ వీధిలో నివసిస్తూ, కృపాదానం ఎవరు? ఆయన పేరు ఈ వీధికి ఎందుకు పెట్టాలని చాలా గందరగోళం సృష్టించారు. దేవుని చిత్తమైన దానిని ఎవరు మార్చగలరు? మనతో ఈ ప్రపంచం ఆగిపోతే మనము బాధపడాలి. ఒకప్పుడు మౌంటు బాటన్‌రోడ్డు పేరును 'అన్నా'గారి పేరుగా మారిస్తే ఎవరు బాధపడ్డారు? అనవసరమైన విషయాలతో మన మనసును ఎందుకు పాడుచేసుకోవాలి?

ఆ కాంపౌండులో ఎవరు కనిపించలేదు. కొంచెం సేపటికి ఒక కుర్రవాడు వచ్చాడు. అందరూ టీన్‌మిషన్‌కు వెళ్ళారు. నాయన అమ్మనబ్రోలు వెళ్ళారు అన్నాడు. అమ్మనబ్రోలులో నా మరదలు స్టాఫ్ నర్సుగా పనిచేస్తుంది. అక్కడికి వెళ్ళాడు. అంతకుముందెన్నడు నేను అమ్మనబ్రోలు వెళ్ళ లేదు. ఇంక చేసేదేమిలేక పిల్లలను వెంటబెట్టుకొని కొండెక్కాను. తర్వాత కనిగిరి వచ్చేశాము.

16వ తారీకున సాయంకాలం 4 గంటలకు మామూలుగా గవర్నమెంటు హాస్పటల్‌లో ఒ.పి.చీట్లు రాస్తున్నాను. మెయిన్‌గేటుకు ఎదురుగా కూర్చుని ఉన్నాను. పోస్టుమేన్ టెలిగ్రాం తెచ్చి సంతకం చేయించుకున్నాడు. నాయన చనిపోయాడు. టెలిగ్రాం కాగితం చేత్తో పట్టుకొని కుడిప్రక్కన ఉన్న లాబ్‌కు నడుస్తున్నాను. భద్రయ్య వాకిట్లో నిలుచుని చూస్తున్నాడు. ఏమిటి రాజేంద్ర? ఇంతలోనే ముసలి వాడివయ్యావు అన్నాడు నవ్వుతూ.

'మా నాయన చనిపోయాడు' అన్నాను.

లోపల హాలులో రామమోహన్‌రెడ్డి డాక్టరు, ఆయన భార్య ఒ.పి. చూస్తున్నారు. వాళ్ళతో సార్! మా ఫాదర్ చనిపోయారు. మూడు రోజులు సెలవు కావాలి అని చెప్పి ప్రెస్ వద్దకు వెళ్ళాను. చంటి అక్కడే ఉన్నాడు. పెద్దబాబు (చక్రవర్తి) సైకిల్ తొక్కుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. చంటి సైకిల్ వెనుక వైపు కూర్చున్నాడు. ఎందుకు వీడు వెనుక కూర్చున్నాడు అనుకుంటు లోపలికి వెళ్ళి రెడ్డిగారికి చెప్పాను. ఆయన కొంచెం డబ్బులు ఇచ్చాడు.

ఇంటికి వచ్చేటప్పటికి చంటి నిద్రపోతున్నాడు. పండుకొని ఉన్న చంటిని లేపి బయల్దేరండి అన్నాను. చంటి విపరీతంగా నిద్రలో ఉండి నిలుచోలేక పోతున్నాడు. సరేనని వాడి జేబులో పది రూపాయలు పెట్టి, నిద్రలేచిన తర్వాత ఒంగోలు రా! అని చెప్పి బస్‌స్టాండ్‌కు వెళ్ళాము. 7 గంటలకు ఒంగోలు చేరాము.

ఫుల్‌సూట్ వేసి హాలు మధ్యలో ఫానుక్రింద ఐస్‌మీద మా నాయన (కృపాదానం) పండుకొని ఉన్నాడు. నేనేమి

ఏడవలేదు. మా అమ్మ చనిపోయినప్పుడు కూడ నేను ఏడవలేదు. నా భార్య పుష్ప చనిపోయినప్పుడు కూడ నేను ఏడవలేదు.

దేవుడు అద్భుతములు చేస్తూనే ఉంటాడు. వాటిని గుర్తించగలిగిన నాడు మనం విశ్వాసులమవుతాము. ప్రభువు నన్ను ఆశీర్వదించినట్లుగా మరెవరిని ఆశీర్వదించలేదు అని నమ్ముతాను. అంటే కృపాదానంగారి వంటి విశ్వాసికి పెద్ద కుమారునిగా జన్మించటం. ఆయనకు 12 మంది సంతానం. మూడవవానిగా, పెద్ద కుమారుడనైనందున ఆయన జీవితంలో ఆయనకు అతి చేరువలో జీవించి కృపాదానం గారు దేవునితో నడచిన విశ్వాస జీవితంలో ఆయనతో కొంతవరకు పాలిభాగస్తుడనయ్యాను. ఇది కోరుకొంటే దొరికేది కాదు అది దేవుని కృప.

అబ్రాహాము గారి అతి గొప్పదైన విశ్వాస జీవితంలో ఆయన విశ్వాస జీవితంను తెలుసుకోగలిగిన ధన్యత ఆయన మనుమడైన యాకోబు గారిదే ఆది.25:27. ఆ చిన్నవారు (ఏశావు, యాకోబు) ఎదిగినప్పుడు ఏశావు వేటాడుటలో నేర్పరి. అరణ్యవాసిగా ఉండెను. యాకోబు సాధువై గుడారాలలో నివశించెను. ఆ గుడారాలలో తాత అబ్రాహాము గారితో నివశించుచుండెను. యాకోబుకి 16 సం॥ల వయస్సు వచ్చేటంత వరకు అబ్రాహాముగారి పెంపకంలో ఉన్నాడు.

నేను కృపాదానంగారి జ్యేష్టపుత్రునిగా ఆయన విశ్వాస జీవితంలో చిన్నతనం నుండి నడిపించబడ్డాను. కనుక ఈనాడు దేశములో కాని విదేశములలో కాని ఎటువంటి ఆర్థిక సంస్థ వారి ఆర్థిక వాగ్దానములు లేకుండా నా జీవితం నడిపించబడుతుంది. ఇంత ధన్య జీవితం కొడవటికంటి కృపాదానంగారి కుమారునిగా ఉండబట్టే కదా. రెవరెండు కృపాదానంగారి జీవితం ఒక పుస్తకమైతే అందులో ఆయన అపజయములు పొందిన భాగములు నేను చదువుకొని గ్రహించి, అద్భుతమైన ఆ యేసయ్య నడిపింపులో ఈనాడు జీవించుటకు కారణమైంది.

రెవ. కృపాదానంగారి ఆత్మీయ అపజయము అమెరికా సహవాసంలో మొదలయింది. కనుక నేను అమెరికాలో ఎవరితో కూడా ఆర్థిక సహవాసం చెయ్యలేదు. గొప్ప విశ్వాసి అయిన కొడవటికంటి కృపాదానంగారి జీవితంను ప్రత్యక్షంగా చూచి, అనుభవపూర్వకంగా తెలుసుకొనిన విషయాలు, నేను ఇంతవరకు విశ్వాశ శక్తితో లోకంలో బ్రతుకుటకు హేతువైంది.

నాకు తెలిసిన కృపాదానంగారి జీవితము నాకు ఎవరు చెప్పలేదు. ఆయనకు స్నేహితులు లేరు. ఆత్మీయ జీవితంలో అన్నదమ్ములు లేరు. యేసయ్యతో నడవాలనే గొప్ప ఆలోచన తప్ప. చాలా తప్పటడుగులు వేశాడు. లోకం చూస్తుంది. ఎగతాళి చేసింది, అవమానపరచింది. కాని యేసయ్య ఎన్నడూ కృపాదానం చేతిని వదలలేదు. మరణ దినములు సమీపించే కొలది ఆర్థికస్థితి పతనమైంది. ఆత్మీయస్థితి పెరిగింది. ఆయన పుట్టినది మే 2వ తారీకున, మరణించినది మే 16వ తారీకున.

16-5-2018న రాత్రి రెండు గంటలకు అంటే 2 గంటలకు నెల్లూరు నుండి లక్కినేని ప్రకాశంగారు ఫోన్ చేసి - కలలో అపొస్తలుల కార్యములు 16వ అధ్యా ఏమిటి? అని మీరు నన్ను అడుగుతున్నారు. ఇప్పుడే కల వచ్చింది అన్నాడు. అపొస్తలులకార్యము కాదు, అపొస్తలుడైన కృపా దానంగారు ఈ రోజు అంటే 16వ తారీకున ప్రభువు దగ్గరకు చేరిన రోజు అన్నాను.

కృపాదానం 1942వ సంవత్సరం ఏప్రిల్ నుండి 1946 చివరివరకు ఆర్మీలోనే ఉన్నాడు. ఆయనను మిలటరీ వారి అలవాట్లు ఏవి అంటలేదు. 1945లో యుద్ధము ఆగిపోయిన తర్వాత కుటుంబము అంతటిని తీసుకొని ఒంగోలు వచ్చారు. దేవలాలిలో ఉన్నప్పుడు కృపాదానంకు ఒక ఆడపిల్ల దెబోరా, ఒక మగపిల్లవాడు విజయచంద్ర జన్మించారు. తర్వాత తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట రైల్వేస్టేషన్‌లో హెగ్గిన్‌బాధమ్స్‌లో ఉద్యోగం దొరికింది.

**(మిగతాది 23వపేజిలో)**

స్త్రీల విభాగం

# ఎస్తేరు

ప్రభువునందు ప్రియ హన్నాకృప పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకు శుభములు కలుగు గాక!

అనేక విధాలుగా క్రైస్తవ స్త్రీలకు ఆదర్శప్రాయమైన ఎస్తేరు జీవితము నుండి కొన్ని ప్రాముఖ్యమైన విషయములు ఈ సంచికలు నేర్చుకుందాము.

ఎస్తేరును గురించి వ్రాయబడిన గ్రంథము కూడ కొంత ప్రత్యేకతను కలిగి ఉన్నది. 1. బైబిలునందు స్త్రీ పేరుతో వ్రాయబడిన రెండు గ్రంథములలో ఎస్తేరు గ్రంథము ఒకటి. 2. హిందూ దేశము అను నామము ఈ గ్రంథములో వ్రాయబడినది. 3. దేవుడు అనే పదము ఈ గ్రంథమందు మనకు కనబడదు.

ఎస్తేరు అనునది పారసీక పదము. ఎస్తేరు అనగా అనగా నక్షత్రము అని అర్ధము. హదస్సా అను మరియొక పేరు కూడా ఈమెకు కలదు. హదస్సా అను పదమునకు అర్థము పరిమళముగల చెట్టు. ఈమె బెన్యామీను గోత్రము నకు చెందిన అబీహాయిలు అను వాని కుమార్తె.

చిరుప్రాయంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన హదస్సా, తన బంధువైన మొర్దెకైచే పెంచబడినది. మొర్దెకై హదస్సాను తన కుమార్తెగా స్వీకరించెను.

ఆ కాలమందు రాజైన అహష్వేరోషు హిందూదేశము మొదలు కూషు దేశము వరకు 127 సంస్థానములను ఏలెను. రాజైన అహష్వేరోషు షూషను కోటలోనుండి రాజ్య పరిపాలన చేయుచుండెను. షూషను ఏలాము యొక్క రాజధాని. గ్రీకువారు దీనికి "సూసా" (Susa) అను పేరు పెట్టారు. ప్రస్తుతం పర్షియాదేశంలో నైరుతి దిక్కునందుండు "సూస్" (Sus) అనునదియే ఈ పట్టణము. ఈ గ్రంథము క్రీస్తుపూర్వం సుమారు 521లో రచించబడి యుండవచ్చు నని పండితులఅభిప్రాయము ఎస్తేరులోనున్న ప్రాముఖ్యమైన గుణలక్షణములను పరిశీలిద్దాం.

**1. సౌందర్యవంతురాలు:** (ఎస్తేరు 2:7)

లోకసంబంధమైన అందము కన్నా ఆత్మీయమైన సౌందర్యం మిన్న. *"అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము యెహోవాయందు భయభక్తులుగల స్త్రీ కొనియాడ బడును. చేసిన పనినిబట్టి అట్టి దానికి ప్రతిఫలమియ్య దగును గవునుల యొద్ద ఆమె పనులు కొనియాడబడును" అని సామెతలు 30:31*లో చెప్పబడిన రీతిగా ఎస్తేరు తనను అలంకరించుకొనుటకు ఇష్టపడలేదు. మరి ఏ అలంకరణ కోరలేదు (3:15) అంటే ఎస్తేరు సౌందర్యవతి అయిన ప్పటికి ఆమె దానిని అలంకరించు కొనలేదు. ఆమె అలంకరణ ఆత్మీయమైనది.

రాణియైన తరువాత కూడ ఎస్తేరు తనను పెంచిన మొర్దెకైనకును, షూషను కోటలో చేర్చబడినప్పుడు రాజు యొక్క షండుడైన హేగేనకును రాజైన అహష్వేరోషునకును వినయ విధేయురాలై వారి దయాదాక్షిణ్యములు పొందెను. భయభక్తులతో వినయ విధేయతలతో మృదువైన గుణ గణములు గల స్త్రీ ఎస్తేరు అనుటలో అతిశయోక్తి లేదు.

**"సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమును అక్షయాలంకారముగల నీ హృదయపు అంతరంగ స్వభా వము మీకు అలంకారముగా ఉండవలెను; అది దేవుని దృష్టికి మిగుల విలువగలది" 1పేతురు 3:4.**

ఈమె భయభక్తులు కలిగి ఆత్మీయమైన సౌందర్యముతో అలంకరించబడినదై దేవుని దృష్టికి ఘనత పొందినది. అందుచేత అనేకమంది స్త్రీలు షూషను కోటలో నున్నను ఎస్తేరు మాత్రమే రాణీగా ఎన్నుకొనబడినది. ఎస్తేరు సాధువై నట్టియు మృదువైనట్టియునైన గుణమును అక్షయాలంకార ముగల హృదయపు అంతరంగ స్వభావముతో నిండిన సౌందర్యవతి.

ప్రియ చదువరీ! ఎస్తేరు వంటి సౌందర్యం కలిగియు న్నామా? లేక లోకసౌందర్యంతోనే తృప్తి చెందుతున్నామా? సాతాను గుణాలైన సౌందర్యము, కోపము, పగ, ద్వేషము, అసూయలతో అలంకరింపబడినావా? ఆలోచించుము. మిర్యాము కోపము, ద్వేషము, అసూయ వలన శాపము



రాణీయైన వష్తికి బదులుగా ఎస్తేరు పట్టపు రాణియైనది.

పొందినదై తన సౌందర్యమును పోగొట్టుకొనినది. కుష్ఠను పొందుకున్నది. గనుక మీ జీవితంలో మిర్యాము వలె నుండక ఎస్తేరులా సౌందర్యవంతురాలై ఉండవలెనని కోరుచున్నాను.

**2. ఔచిత్యము గల స్త్రీ:** సందర్భానుసారంగా, జ్ఞానముతో ప్రవర్తించుటను ఔచిత్యము కలిగియుండుట అంటారు. ఎస్తేరు దైవ జ్ఞానముతో తన శత్రువుపై జయము సాధించినది అనవచ్చు. "రాజువైన తమకు అనుకూలమైతే రాజవైన తామును, హామానును మీ నిమిత్తము నేను చేయింపబోవు విందునకు రావలెను....ఇదే నా మనవియు నా కోరికయు అనెను" (ఎస్తేరు 5:8).

స్వచిత్తము ననుసరించినట్లయితే శ్రమలకు గురికావలసి వచ్చేది. రాణిగా తనకున్న అధికారాన్ని బట్టి లేదా, రాజు భార్యగానో ఎస్తేరు ఎటువంటి ప్రయత్నము చేయలేదు. దేవుని మీద భారము వేసి ఉపవాసంతో దేవుని మీద ఆధారపడినది.

సౌలు శత్రువై దావీదును తరుముచుండగా దావీదు సౌలునకు మేలు చేయుచు వచ్చెను. అలాగే ఎస్తేరు కూడా దైవజ్ఞానానుసారంగా నడిచినందున ఆమె, తన స్వీయ జనులుతో నెమ్మది పొందినది.

**"నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము" సామెతలు 3:5**

**3.ప్రజాభిమాని ఎస్తేరు:** "నా జనుల మీదకి రాబోవు కీడును, నా వంశము యొక్క నాశనమును చూచి నేను ఏలాగు సహింపగలను" అని మనవి చేసెను. (ఎస్తేరు 8:6). స్వజనులపట్ల తనకున్న ప్రేమ ప్రగాఢమైనది. తన రక్షణకై తన సుఖసౌఖ్యములను విడిచి నేను నశించినను నశించెదను అని 3 దినములు తవ స్వజనులపై అభిమానముతో ఉపవాసముండెను.

అదే విధముగా భక్త పౌలు తన దేహ సంబంధులైన సహోదరుల కొరకు నేను క్రీస్తు నుండి వేరై శాపగ్రస్తుడనైయుండ గోరుదును అని తన స్వజనులపై అభిమానమును చూపుచున్నాడు (రోమా 9:3). మోషే సాగిలపడి ఇశ్రాయేలీయుల దోషము నిమిత్తమై దేవుని వేడుకొని ఒకవేళ తమ పాపమును పరిహరింపని యెడల నీ గ్రంథంలో నుండి నా పేరు తుడుచివేయుము అని మోషే భారము గలిగి దేవునికి ప్రార్ధించెను (నిర్గమ. 32:32).

**4.ధైర్యవంతురాలు:** మా విరోధియైన ఆ పగవాడు దుష్టుడైన ఈ హామానే (7:6) అని పూర్ణ ధైర్యముగా రాజుతో చెప్పెను. భయము లేకుండా ఉండుటకుగల కారణము తన ప్రజలపై ఆమెకున్న ప్రేమయే.

**ప్రేమలో భయముండదు. అంతేకాదు పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్ళగొట్టును. (1 యోహాను 4:18).**

ఈమె తన ప్రజలను ప్రేమించిన స్త్రీ గనుక భయపడ లేదు. భక్తిలో ధైర్యమున్నది. **నీ భక్తి నీకు ధైర్యమును పుట్టింపదా?** అని యోబు 4:6లో వ్రాయబడియున్నది.

ప్రియ చదువరీ! మనప్రేమ, మనభక్తినిబట్టియే మనము ధైర్యము కలిగి యుండగలము. దేవుడు మనకు పిరికి ఆత్మను ఇవ్వలేదు. ఇప్పుడైన నీవు ధైర్యము గలిగి నశించుచున్న ఆత్మల కొరకై ధైర్యముతో కృపాసనము యొద్దకు చేరుము. **"పైకి భక్తి గలవారివలె యుండియు దాని శక్తిని ఆశ్రయించని వారునై యుందురు. ఇట్టివారికి విముఖుడవై యుండుము" (2 తిమోతి 3:5)**

ప్రియ చదువరీ ! నీవు నీ స్వజనులపై ఎట్టి భారమును కలిగియున్నావు? ఇప్పుడైనను నీవు భారము గలిగి ఎస్తేరు వలె త్యాగపూరితమైన సేవను చేసి ఎస్తేరు వంటి సౌందర్యమును, ధైర్యమును, ఔచిత్యమును స్వజనాభిమానమును కలిగి దేవుని కొరకు నిరంతరము ప్రకాశించు నక్షత్రమువలె నుండవలెనని ప్రార్థించుచున్నాను. దేవుడు అట్టి కృపను మీకు అనుగ్రహించును గాక! ఆమేన్.

## గమనిక

క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

చిన్నపిల్లల పేజి

# విశ్వసించుట

సన్ని, బన్నీలు తమ క్రొత్త స్కూల్‌లోని విశేషాలను ఎంతో ఉత్సాహంగా తండ్రితో చెప్తున్నారు. తండ్రి శ్రద్ధగా ఆలకిస్తున్నాడు. ఇంతలో సన్ని డాడీ నీకొక విషయం తెలుసా, ఈ మా న్యూ స్కూల్‌లో గార్డెనింగ్ క్లాస్ ఉంది. రేపు మాకు విత్తనాలు ఇచ్చి స్కూల్ క్యాంపస్‌లోనే నాటిస్తారట. ప్రతి ఒక్కరు అనుదినం వారి వారి మొక్కలను గూర్చి శ్రద్ధ వహించి మంచిగా వాటిని పెంచితే లండన్‌లో ఉండే మా స్కూల్ ప్రిన్సిపల్ గారి అబ్బాయిగారికున్న పెద్దతోటను చూడుటకు అనుమతిని ఇస్తారట. పైగా అక్కడకు వెళ్ళుటకు ఉండుటకు పెట్టవలసిన ఖర్చు అంతా వారే భరిస్తారట అంటే పూర్తిగా ఉచితం. ఆ తోటను ఎప్పుడెప్పుడూ చూస్తానా అని నాకు చాలా ఉత్సాహంగా ఉంది అన్నాడు.

మరి నీ సంగతి ఏంటి అడిగాడు తండ్రి బన్నీని. స్కూల్‌లో మొక్కలు పెంచడం కోసం స్కూల్ యాజమాన్యం ఏవేవో చెప్తున్నారు డాడీ. అవన్నీ నేను అస్సలు నమ్మను. అయినా ఎవరైనా తమ డబ్బు మన కోసం ఖర్చుచేస్తారా? ఇవన్నీ ఊరికే చెప్పే మాటలు అన్నాడు బన్నీ చాలా తేలికగా.

మరునాడు స్కూల్లో విత్తనాలు ఇవ్వబడ్డాయి. సన్నీ బన్నీలు తమ తమ విత్తనాలు నాటారు. ఒక వారం లోపే విత్తనాలు ఫలించి మొలకలు వచ్చాయి. ఆ మెలకులు రాగానే సన్నీ ఆనందానికి హద్దులు లేవు. తన మొక్కలు త్వరగా ఎదిగి మంచి అందమైన పూలు పూస్తుందని ఆశించి అనుదినం తన మొక్కలు నీరు అందించడం మొదలు పెట్టాడు సన్నీ.

కొన్ని రోజులు గడిచాక తన మొక్కను జంతువులు పాడు చేస్తున్నాయని గమనించి దాని చుట్టు చిన్న ఫెన్సింగ్ లాంటిది ఏర్పాటు చేశాడు. మొక్క అయితే బాగానే ఉంది కాని దానికి ఎటువంటి పూలు గాని, కాయలుగాని లేవు. సన్ని తన స్కూల్ ప్రక్కనున్న తోటకు వెళ్ళి ఆ తోటమాలిని అడిగి కొన్ని టిప్స్ తెలుసుకొని వాటిని తన మొక్క మీద ప్రయోగించినప్పటికి అతని మొక్క ఎటువంటి పూలు లేకుండా అలానే ఉంది. సన్ని తన స్నేహితులతో మొక్కలు గురించి మాట్లాడేవాడు, లైబ్రరీకి వెళ్ళి తోటపనికి సంబంధించిన పుస్తకాలు చదివేవాడు అయినా సన్నీ మొక్క లో ఎటువంటి మార్పు లేదు.

ఒకరోజు సాయంత్రం ఇంటిహాల్‌లో డల్‌గా కూర్చున్న సన్నిని ఏమైంది అడిగాడు తండ్రి. సన్ని సమాధానం చెప్పేలోపే బన్ని అందుకొని ఏముంది డాడీ, సన్నిగాడి మొక్క సరిగా ఎదగడం లేదు. నేను ముందే చెప్పాను స్కూల్ వాళ్ళు చెప్పేవి నమ్మవద్దు అని అయినా వింటేగా. అదే వాడి బాధ అన్నాడు .

తండ్రి సన్నికి దగ్గరగా జరిగి నీవు నీ మొక్కకు సరిగా నీరు అందించావా అని అడిగాడు. మళ్ళీ బన్నీ అందుకొని స్కూల్ అవర్స్ అవ్వగానే వాడి పని అదే డాడీ, మొక్కకు నీళ్ళు ఇవ్వడమే కాదు, దాని చుట్టూ చిన్న ఫెన్సింగ్ కూడా కట్టాడు. మొక్క ఫలించాలని ప్రూనింగ్ కూడా చేశాడు. మొక్క మంచిగా ఎదిగి ఫలవంతంగా మారితే లండన్‌లో ఉన్న గార్డెన్ చూడడానికి స్కూల్ యాజమాన్యం పంపాలి. కాని అలా జరగనివ్వరు అని నాకు ముందే తెలుసు. కాబట్టి నా మొక్కను గురించి నేనెటువంటి శ్రద్ధ వహించలేదు. అయినా వాడి మొక్కకు నా మొక్కకు ఏమి తేడా లేదు. అన్నాడు బన్ని గుక్కతిప్పుకోకుండ.

సన్నికి బాధగా ఉందని గ్రహించిన తండ్రి చూడు సన్ని నీవు చేయగలిగింది నీవు చేశావు, నీ మొక్కను గురించి శ్రద్ధ కలిగి ఉన్నావు, దాని కొరకు కష్టపడ్డావు కాబట్టి ఇక నీవు దిగులు పడవలసినది ఏమి లేదు. దేవుని మీద భారం వేయడమే మనం చేయగలిగింది అన్నాడు.

అంటే నేను లండన్‌లోని ఆ తోటను చూడలేనా? అన్నాడు దిగాలుగా. ఎందుకు చూడలేవు సన్ని? మీ టీచర్లు చెప్పిన విధంగా నీవు అన్ని చేశావు కదా!అన్ని సరిగా చేసినవారినే కదా ఆహ్వానం అందుతుంది అన్నాడు తండ్రి.

నిజంగానా డాడీ అన్నాడు సన్ని మెరుస్తున్న కళ్ళతో.

అన్నిటికంటే బలమైనది, విలువైనది, కష్టతరమైనది విశ్వసించడం. యేసుక్రీస్తు నందు పాపక్షమాపణ కలదని విశ్వసించి దానిని కాపాడుకొనుటకు యేసయ్య చెప్పినట్లు చేసినవాడికే పరలోకం. ఎవరైతే ఈ విషయాన్ని విశ్వసిస్తారో వారే యేసయ్యను వెంబడిస్తారు, పరలోకవారసులౌతారు. నమ్మనివారికి పరలోకం లేదు. అలాగే నీకు ఇవ్వబడిన పనిని నీవు శ్రద్ధగా నిర్వర్తించావు. నీ టీచర్లు చెప్పిన అన్ని సూచనలు పాటించావు. నీ మొక్కను వృద్ధిలోకి తేవడానికి కష్టపడ్డావు. అయినా మొక్కను సరిగా పెంచిన వారికి ఆహ్వానం పంపబడుతుంది అని చెప్పారే తప్ప ఫలించిన మొక్కలు కలిగినవారికే ఆహ్వానం అని చెప్పలేదు కదా. కాబట్టి నీకు ఇవ్వబడిన దానిని నీవు విశ్వసించు అన్నాడు తండ్రి.

సన్ని మనస్సు తేలికపడింది. సన్ని తన మొక్క పూలు పూస్తుందని, కాయలు కాస్తుందని ఆశించక మొక్కకు సకాలంలో నీటిని అందిస్తూ ఉండేవాడు. అతని మొక్క జీవం కలిగి మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే విధంగా ఉండేది. ఒకరోజు స్కూల్ అసెంబ్లీలో గార్డెనింగ్ క్లాస్ వారందరూ లండన్‌కు ఆహ్వానింపబడినారని ప్రకటించబడుతుంది. పిల్లలందరూ చాలా ఉత్సాహంగా, ఉచితంగా తమ కొరకు ఏర్పాటు చేయబడిన యాత్రకు సంతోషంగా వెళ్తారు. ఇవ్వబడిన ధన్యతను విశ్వసించని బన్ని తప్ప.

ఆ తోటను చూసిన సన్ని ఎంతో సంతోషిస్తాడు. తిరుగు ప్రయాణంలో గార్డెనింగ్‌లో వారు చూపిన శ్రద్ధకు అనుగుణంగా బహుమతులు ఇవ్వబడతాయి. సన్నీ అందరికంటే విలువైన బహుమతితో పాటు ప్రశంసలను అందుకొని సంతోషంగా తిరిగివస్తాడు. వారం రోజుల తరువాత తన మొక్కను చూసిన సన్నీ ఆనందానికి హద్దులు లేవు. అతని మొక్క పూలతో నిండి ఎంతో అందంగా ఉన్నది.

**"తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను"** యోహాను 1:12.

**(19వ పేజి తరువాయి)**

కృపాదానంగారికి కాని ఆయన భార్య హన్నమ్మకు గాని చిన్నతనం నుండి దేవుని సేవ చెయ్యాలని ఆశ. తర్వాత కాలంలో 1952-54లో మంచి ఆదాయములో కలిగిన ఉద్యోగం చేశాడు. 1953లో విజయవాడ గుణదల కేంద్రంగా మెట్రోపాలిటన్ చర్చిలో 4సంవత్సరాలు పనిచేసి 1955-56 సంవత్సరాలలో రామాయపట్నం బాప్టిస్టు థియోలాజికల్ సెమినరిలో కుటుంబం అంతటితో సెమినరి చదివాడు. 1957లో విశ్వాసం సంబంధమైన సేవ తన భార్యతో కలిసి ప్రారంభించాడు.

1958లో పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో రైల్వేలో పనిచేస్తున్న ఎడ్వర్డు అనే దైవసేవకుల సహవాసంతో అమెరికాలోని ఒక చిన్నసంఘం కృపాదానంతో కలిసి సేవకు వచ్చారు. 1964 కృపాదానంను అమెరికా పిలుచుకున్నారు.

1965లో అమెరికాలో వరల్డ్ విజన్ అనే సంస్థవారి ద్వారా ఒంగోలు, దొనకొండ, కనిగిరి పట్టణాలలో అనాథ శరణాలయములలో వేలకొలది అనాథలను పోషించాడు.

1976వ సంవత్సరం వచ్చేటప్పటికి టీన్‌మిషన్స్ అనే సంస్థను భారతదేశము తీసుకొని వచ్చాడు. 1987వ సంవత్సరం మే నెల 16న ఆయన ప్రభువు సన్నిధికి చేరాడు. ప్రస్తుతం ఆయన సంతానం (కుమారులు, కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్రు, ముది మనుమలు, ముదిమనుమరాండ్రు) 180 మందికంటే ఎక్కువే.

**(సమాప్తం)**

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**

**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**

**6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001**

**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**



# బైబిల్ క్విజ్-09

## యెహోషువ 14-24 న్యాయాధి. 1-14



1. కనాను దేశమును వేగు చూచుటకు వెళ్ళినప్పుడు కాలేబు వయస్సు ఎంత?(యెహో. 14అ)
2. ఒత్నీయేలు భార్య పేరు ఏమిటి? (15అ)
3. కనానీయులు ఎక్కడ ఎఫ్రాయిామీయులకు దాసులైయున్నారు?(16అ)
4. సెలోపెహాదు కుమార్తెల పేర్లు ఏమిటి?(17అ)
5. ఇశ్రాయేలీయులు కనాను దేశమును స్వాధీనపరచు కొనిన తరువాత ప్రత్యక్షపు గుడారమును ఎక్కడ వేసిరి?(18అ)
6. నాలుగవవంతు చీటి ఎవరిపక్షముగా వచ్చెను?(19అ)
7. పొరపాటున ఒకని చంపిన నరహంతకుడు పారి పోవుటకు ఏమి ఏర్పాటు చేసుకోమని యెహోవా సెలవిచ్చెను?(20అ)
8. ఇశ్రాయేలీయుల స్వాస్థ్యములో లేవీయుల పట్టణము లెన్ని?(21అ)
9. యాజకుడైన ఎలియాజరు కుమారుని పేరేమి? (22అ)
10. ఒకడు ఎంతమందిని తరుమునని ఇశ్రాయేలీయుల పెద్దలు, న్యాయాధిపతులతో చెప్పెను?(23 అ)
11. యెహోషువ ఎన్ని సంIIలు జీవించెను? (24అ)
12. కాలేబు తమ్ముడు పేరు ఏమిటి? (న్యాయా. 1అ)
13. యెహోషువను ఎక్కడ పాతిపెట్టిరి? (2అ)
14. అరామ్నహరాయిము రాజు పేరు ఏమిటి? (3అ)
15. దెబోరా భర్త పేరు ఏమిటి? (4అ)
16. దెబోరా కాలములో ఎన్ని సంవత్సరములు దేశము నెమ్మదిగా ఉండెను? (5అ)
17. 'పరాక్రమముగల బలాఢ్యుడా' అని యెహోవా దూత ఎవరిని పిలిచెను? (6అ)
18. గిద్యోనుతో యుద్ధమునకు వెళ్ళిన వారిలో ఎంత మంది తిరిగి వెళ్ళిపోయిరి? (7అ)
19. మిద్యాను రాజుల పేర్లు ఏమిటి? (8అ)
20. అబీమెలెకు తన సహోదరులు డెబ్బదిమందిని చంపినప్పుడు ఎవరు తప్పించుకొనెను? (9అ)
21. యాయీరు ఎంతకాలము ఇశ్రాయేలీయులకు న్యాయాధిపతిగా ఉండెను? 10అ)
22. యెఫ్తా తండ్రి పేరు ఏమిటి? (11అ)
23. ఏలోను ఇశ్రాయేలీయులకు ఎంతకాలం అధిపతిగా ఉండెను? (12అ)
24. మానోహ ఏ పట్టణస్థుడు? (13అ)
25. సమ్సోను తిమ్నాతులో ఏ జంతువును చంపెను? (14అ)

## బైబిల్ క్విజ్ - 08జవాబులు

1. మూడవ తరమువారు (ద్వితీ.23:8) 2. ఒలీవ, ద్రాక్ష పండ్లను (24:20,21) 3.అమాలేకీయులు (25:19) 4. 3వసంవత్సరమున (26:12) 5. చెక్కనిరాళ్ళతో (27:6) 6. 2 (28, 32) 7. సీహోను (29:7) 8. జీవమును, మరణమును, ఆశీర్వాదమును, శాపమును (30:19) 9. ప్రత్యక్షపు గుడారములో, మేఘస్తంభములో (31:15) 10. సీను అరణ్యములో, కాదేషు మెరీబా నీళ్ళ యొద్ద (32:51) 11.34వ అధ్యా.12. మోయాబు దేశములో (34:5)13. నూను (యెహో. 1:1) 14. షిత్తీము (2:1) 15. 2000 కొలమూరలు (3:4) 16. 12 రాళ్ళను, గిల్గాలులో (4:20) 17.14వ తేదిన, యెరికో మైదానములో (5:10) 18. 13 సార్లు (6:4) 19. కర్మీ (7:1) 20. 12,000 మంది (8:24,25) 21. గిబియోను, కెఫీరా, బెయేరోతు, కిర్యాత్యారీము (9:17) 22.వడగండ్లను వారిమీద పడ వేసెను (10:11) 23. హోలాకు, హెర్మోను (11:16,17) 24. ఓగు (12:4) 25. ఆయనకు అర్పింబడు హోమ ములు మరియు దేవుడే వారికి స్వాస్థ్యము (13:14,33)